సంపుటి 9 సంచిక 1 నవంబర్ - డిసెంబర్ 2020

# పల్లెసృజన

www.pallesrujana.org

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

honeybee.org

Vol-9 Issue-1







# చూడాలనుకున్నదే చూసే అలవాటు



ఒకానొక కాలంలో జపాన్ దేశంలో రెండు కప్పలుండేవి. ఒకటి సముద్రం ఒడ్డున ఒసాకా నగరం దగ్గర ఓ గుంటలో నివసించేది. రెండోది క్యోటో నగరం గుండా పారే స్వచ్ఛమైన సెలయేరులో ఉండేది. అంత దూరాన ఉండటం వలన అవి ఒకదాని గురించి ఒకటి ఎప్పుడూ విని ఉండలేదు. కానీ ఆశ్చర్యంగా ఆ రెండింటికీ ఒకేసారి ప్రపంచాన్ని చూడాలన్న తలంపు వచ్చింది. క్యోటో నగరంలో నివసించే కప్ప ఒసాకా నగరం వెళ్లాలని, ఒసాకాలోని కప్ప క్యోటో నగరం చూడాలని నిశ్చయించుకున్నాయి.

సరే, వసంత కాలంలో ఒక ఉదయాన రెండు కప్పలూ క్యోటో, ఒసాకా రోడ్డెక్కాయి. ఒకటి ఈ చివరి నుంచి, ఇంకోటి ఆ చివరినుంచి. ప్రయాణం అవి అనుకున్నంత సులభంగా లేదు. ఇద్దరికీ ప్రయాణించే అలవాటు లేదు మరి. అదీగాక, రెండు ఊళ్ళ మధ్యలో ఒక పెద్ద కొండ ఉంది. దాన్ని అవి ఎక్కాల్సి వచ్చింది. చాలా సమయం తీసుకొని చాలా దూరం గెంతి ఎట్టకేలకి కొండ శిఖరాన్ని ఒకేసారి చేరుకొని ఒకదాన్ని ఒకటి ఎదురెదురుగా చూసుకొని ఆశ్చర్యపోయాయి.

ముందు మాటా పలుకు లేకుండా ఒకదాన్ని ఒకటి తేరిపార చూసుకొని తరువాత మాటల్లో పడ్డాయి. తాము ఇక్కడనుంచి ఇంత దూరం ఎందుకొచ్చామో చెప్పుకొన్నాయి. ఇద్దరిదీ ఒకే కారణం, ఒకే కోరిక..... దేశాన్ని చూడటం అన్నది తెలుసుకొని చాలా ఆనందపడిపోయాయి. సరే తొందరేం లేదని నిర్ణయించుకొని కొంతసేపు ఒక చల్లని తడి ప్రదేశంలో విశ్రాంతి తీసుకొని ఎవరి దారిన వారు ప్రయాణం సాగించాలని నిర్ణయించుకొన్నాయి.

మనం కొంచెం పొడుగ్గా ఉండివుంటే బావుండేది. చక్కగా ఇంతెత్తునుంచి రెండు నగరాల్నీ ఒకేసారి చూసుకొని మనం వెళ్ళి అక్కడ చూడాల్సినంత ఏముందో తెలుసుకునేవాళ్ళం అని ఒసాకా కప్ప. దానికి క్యోటో కప్ప "అదేం పెద్ద కష్టమైన పనేం కాదు, మనం వెనక కాళ్ళపై నిలబడి ఒకరినొకరం గట్టిగా పట్టుకొని ఉండగలిగితే మనం వెళ్ళదలుచుకున్న ఊరిని చూడొచ్చు కదా" అంది.

ఈ ఆలోచనా ఒసాకా కప్పకి చాలా నచ్చింది. నచ్చడమేంటి వెంటనే అది తన స్నేహితుడి భుజాలు పట్టుకొని నిలబడింది. ఇవతలి కప్ప మెల్లగా లేచి నిలబడింది. ఇద్దరూ ఒకరినొకరు గట్టిగా పట్టుకొని క్యోటో కప్ప ఒసాకా వైపు, ఒసాకా కప్ప క్యోటోవైపు దృష్టి సారించాయి. కానీ పాపం అవి ఒక విషయం మరిచిపోయాయి. అవి నిలబడ్డప్పుడు వాటి ముక్కులు అవి వెళ్ళవలసిన వైపుకు ఉన్నా, వాటి కళ్ళు వెనకవైపుకు ఉంటాయి అన్నది. ఫలితంగా అవి ఎక్కడినుంచి వచ్చాయో ఆ నగరాన్నే చూశాయి.

అయ్యో క్యోటో నగరం కూడా అచ్చం ఒసాకాలాగానే ఉన్నది, అనవసరంగా అంత దూరం ప్రయాణం చెయ్యనవసరం లేదు, నేను వెనక్కి వెళ్ళిపోతానన్నది ఒసాకా కప్ప. అప్పుడు నాదిక్కడా ఒసాకా నగరం క్యోటోలాగనే ఉంటుందని ఏమాత్రం తెలిసినా నేసలు ఈ ప్రయాణం చేసేదాన్నే కాదు అన్నది క్యోటో కప్ప. ఇలా అనుకుని ఒకరి భుజంమీంచి ఒకరు చేతులు తీసేసి గడ్డిమీదకు వచ్చి పడ్డాయి. కొత్తగా చూసేదేం లేదని నిర్ణయించుకొని అవి మర్యాదపూర్వకంగా వీడ్కోలు చెప్పుకొని ఎవరు వచ్చిన దారిలో అవి తిరిగి ప్రయాణమయ్యాయి. జీవితాంతం ఆ రెండూ క్యోటో, ఒసాకా నగరాలు ఒకేలా ఉంటాయన్న భ్రమలో ఉండిపోయాయి.

నిజానికి వాటికి రెండు బఠానీ గింజలకున్న పోలిక ఉన్నా రెండు నగరాలకుండే వ్యత్యాసం వుంది.

అప్పుడప్పుడూ మనం మనం దూరదృష్టికి, జీవన దృక్పథానికి దగ్గరగా వుంటామని అనుకుంటాం. దగ్గరగా అంటే భౌతిక దూరం కాదు, అది నేర్చుకోవాలన్న దృక్పథం. మన ఆలోచనలు కుదించుకుపోతే మన దూరదృష్టి హ్రస్వమైతే మన జీవితంలో కొత్తపుంతలు తొక్కలేము. ఎందుకంటే మనకు ప్రస్తుతమున్న అనుకూల పరిస్థితుల్లోనే ఉండాలని కప్పల్లా అనుకుంటాం. ప్రస్తుత అనుకూల పరిస్థితిలోనే మనం ఎప్పుడూ వుంటే కొత్త ఆలోచనలు ఎలా వస్తాయి, కొత్త పుంతలు ఎలా తొక్కగలం. మనము అనిశ్చిత పరిస్థితిని, కొత్త ప్రదేశాలను, అనామకులను, తెలియని సంస్కృతిని, తెలియని మార్గాలను శోధించలేము. కొత్త మార్గాలను శోధించాలంటే కప్పలా కాకుండా, కుతూహలంతో చూసింది ఒప్పుకోవద్దు.

– హాసీపీ 22(2) జనవరి–జూన్ 2011

Vol-9, Issue - 1 November - December 2020

# పల్లెసృజన

సంపుటి-9 సంచిక-1 నవంబర్-డిసెంబర్ 2020

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27111959, 98660 01678
E-mail : president@pallesrujana.org
Visit www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సంపాదకులు :
**జంధ్యాల శశిమోహన్**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సహాయకులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**పి. చంద్రకాంత్ శర్మ**
**రాఘవమూర్తి దుర్గాప్రసాద్**
**జంధ్యాల శ్రీనాథ్**
**కల్యాణ శాస్త్రి**

కార్టూన్స్ : **వెంకట్**


డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్**, హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail :
narendragrafixhyd@gmail.com


**Rs. 1,000/-
for 5 years Subscription**

## విషయ సూచిక



పండ్ల తోటల మార్గదర్శి మార్గదర్శి చింతారెడ్డి 3



గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్స్ 18



'పల్లెసృజన'కు రైతు నేస్తం పురస్కారాలు 6



పోచంపల్లి నేత కుటుంబాలకు ఊరటనిచ్చిన చింతకింది నరేందర్ ఇన్నోవేషన్స్ 21


10వ ద్వైవార్షిక పోటీ విజేతలు 7


నష్టం తగ్గించే అద్భుత శక్తిగల కరెంటు స్తంభాలను సులభంగా ఎక్కగలుగుతున్న 'మహిళా మణులు' 24


పేషెంట్‌లను సులువుగా తరలించే పరుపు 12


ఆయుర్వేద జ్ఞాన మథనం - మనకు పట్టనివ్వని 'ఆస్తమా' 29


డా. ఏపీజే అబ్దుల్ కలాం 'ఇగ్నైట్-2019' పోటీ విజేతలు 14

కరోనా సమయంలో 'వెబినార్'ల ద్వారా ప్రజలకు చేరువైన 'పల్లెసృజన' 31

<u>కవర్ లోపలి పేజీలో ...</u>
చూడాలనుకున్నదే చూసే అందాలు - హాబీ కథ
అమ్మకానికి సిద్ధంగా వున్న రైతుల కోసం రైతుల ఇన్నోవేషన్స్
<u>మధ్య పేజీలో :</u>
నవంబర్ - డిసెంబర్ మాసాల్లో 'పల్లెసృజన' కార్యక్రమాలు

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix**, 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. -500094. Telangana State. Editor : **J. Sesimohan.**

**HoneyBee Regional Collaborators & Publications**

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangpura, Ahmedabad - 380 009 Gujarat, India, Phone: 91-79-27912792, Fax: 91-79-27913249 Email: honeybee@sristi.org

**Karshakan Samsorikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala. hmathew@gmail.com

**Num Vali Velammai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekanvs@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# సన్న, చిన్నకారు రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ

[illegible]



[illegible]

# పండ్ల తోటల రైతుల మార్గదర్శి లింబారెడ్డి



- పల్లె వీరరాఘవ రెడ్డి

మార్గదర్శకత్వం అన్నది మిగతా రంగాలలో లాగానే 'వ్యవసాయ' రంగంలో కూడా ఎప్పుడూ అవసరమే అవుతోంది. వ్యవసాయదారులలో నిరక్షరాస్యత ఎక్కువగా ఉంటుంది. తనకు తెలిసినా, తెలియకపోయినా తోటి రైతులను అనుకరించడం చేస్తూ వుంటారు. కొందరు స్ఫూర్తిగల రైతులు తమ స్వంత ఆలోచనలతో ప్రయోగాలు చేసి, వ్యవసాయంలో మంచి ఫలితాలు సాధిస్తున్నారు. అటువంటి వారిని ఇతరులు గుడ్డిగా అనుకరించకుండా, వివరాలు తెలుసుకొని, సంతృప్తి చెంది అటువంటి పద్ధతులను వాడటం మంచిది. ఈవిధంగా కొత్త పద్ధతులు కనుగొన్న రైతులు కూడా తోటి రైతులు అడిగినప్పుడు కాని, అసలు అడగకుండానే తన విజయానికి కారణాలు నలుగురికీ తెలియజేసినప్పుడే వ్యవసాయ రంగంలో మార్గదర్శకులు అవుతారు. కూడా తప్పకుండా మార్గదర్శకత్వం చేసే వారి సూచనలను అనుసరించిన రైతులు ఎక్కువ శాతం లాభపడ్డ దాఖలాలు ఉన్నాయి. అలాగే మోసపూరిత సలహాలను అనుసరించకుండా పసిగట్టేస్తేనే రైతులు బాగు పడతారు. ఒక్కటి మాత్రం నిజం రైతుకు తనకు తోచినంత వరకు మంచి 'చేయాలి' అనుకుని సహాయ సహకారాలు అందించిన వారి కృషి అనిర్వచనీయం. అలాంటి వారే 'మార్గదర్శకులు' అవుతారు. అలాంటి కోవకి చెందిన వ్యక్తి లింబారెడ్డి గారిని గురించి తెలుసుకుందాం.

ఎస్సెస్సీ వరకు చదువుకుని, వ్యవసాయం మీద మక్కువతో ఉద్యోగాన్ని కూడా వదులుకుని పరిపూర్ణ రైతుగా మారిన వ్యక్తి నిజామాబాద్ జిల్లా, ముప్కాల్ మండలం, వెంచిర్యాల గ్రామానికి చెందిన రైతు లింబారెడ్డి. వీరికి ఇద్దరు సంతానం ఒక అమ్మాయి, ఒక అబ్బాయి. అమ్మాయి వివాహం చేసుకుని స్థిరపడిపోగా, అబ్బాయి అమెరికాలో ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. లింబారెడ్డికి 37 ఎకరాల పొలం వుంది. వెంచిర్యాల గ్రామ పొలిమేరలో 20 ఎకరాలు ఉండగా, హైదరాబాద్ శివారులో గల 'తూప్రాన్' గ్రామంలో 18 ఎకరాల పొలం వుంది. తూప్రాన్‌లో 12 ఎకరాలలో మామిడి మరియు జామ కలిపి నాటడం జరిగింది. మిగతా 6 ఎకరాలు సీతాఫల మొక్కలు నాటడం జరిగింది. తన గ్రామ పొలిమేరలో వున్న 20 ఎకరాలలో 13 ఎకరాల పొలంలో మామిడి, 2 ఎకరాలు సీతాఫలం, 2 ఎకరాలు ఆపిల్ తోటలను పెంచుకుంటూ, మిగతా 3 ఎకరాల్లో తనకు, తన వారికి అవసరమైన వరి, ఇతర ఆహార పంటలను పండించుకుంటూ వుంటారు.

లింబారెడ్డి కి పండ్ల తోటలంటే ఎంతో మక్కువ. తాను ఆచరించడమే కాదు తనవద్దకు వచ్చిన రైతులకు కూడా తాను ఆచరించిన పద్ధతులను గురించి వివరిస్తూ పండ్ల తోటల పెంపకం చేయమని ప్రోత్సహిస్తూ వుంటారు. ముఖ్యంగా వీరు

మామిడి పండ్లలో శ్రేష్టమైన 'రసాల' రకాన్ని విరివిగా సాగు చేసుకోమని, మొక్కలు ఫలానా చోట లభిస్తాయి వెళ్ళి తెచ్చుకోండి అని చెబుతూ, పండ్ల తోటల పెంపకంలో కూడా నిత్యం ఆ రైతులకు సలహాలు ఇస్తూ, అవసరమైనప్పుడు వారి తోటల వద్దకు కూడా వెళ్ళి సలహాలు ఇస్తూ వుంటారు. ఇప్పటికి వీరి సలహాతో మామిడి తోటలు నాటిన రైతులు 20 మందికి పైగా వుండగా, తోటలు నాటిన పొలం 500 ఎకరాలకు పైమాటే.

పాత మూస పద్ధతిలో తోటలు పెంపకం అంటే వీరి సూత్రానికి ఇష్టముండదు. కొత్తదనం కోసం తపించే మనస్తత్వం. కొత్త రకం పండ్ల తోటలను పెంచి అందరికన్నా ముందుగా ఆచరించి, లాభాలు ఆర్జించుకోవాలని సూచిస్తూ వుంటారు ఈయన. కొత్తదనం లేకుండా పండ్ల తోటలు పెంచి, వాటికి సరైన ధర రావటం లేదు, నష్టపోతున్నాము అని నిత్యం రైతు బాధపడుతున్న సంఘటనలు చూసి ఈ మార్గాన్ని ఎంచుకుని తాను ఆచరించడంతో పాటు, ఇతర రైతులు ఆచరించేలా చేసి, అందరూ లాభాల బాట పట్టేలా చేయాలన్న వీరి ప్రయత్నాన్ని 'పల్లెసృజన' మనస్ఫూర్తిగా అభినందిస్తోంది.

నూతనత్వాన్ని ఆహ్వానిస్తారు అనటానికి ఓ చిన్న ఉదాహరణ వీరు పెంచుతున్న 'హరిమాన్ 99' ఆపిల్ పండ్ల తోట. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) వారు వెలుగులోకి తెచ్చిన హిమాచల్ ప్రదేశ్ చెందిన రైతు హరిమాన్ శర్మ, 48 డిగ్రీల ఎండలో కూడా ఆపిల్ పండించవచ్చు అని నిరూపించటంతో వీరికి రాష్ట్రపతి పురస్కారం ఇచ్చింది. ప్రోత్సహించటానికి దక్షిణ భారతంలో కూడా ఈ ఆపిల్ అంట్లని పంపిణీ చేయడం జరిగింది.

ఈ క్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల రైతులు విపరీతంగా జామ, గోల్డెన్ సీతాఫలం, మామిడి తోటలు పెంపకం వైపు పరిగెడుతున్న సమయంలో ఈ 'ఆపిల్' పంటను గురించి తెలుసుకుని ఇలాంటి కొత్తరకం పంట వేస్తే ముందుగా మంచి ధరలను అందిపుచ్చుకోవచ్చు కదా అని ఆలోచించి, ధైర్యంతో ఒకేసారి 2 ఎకరాల పొలంలో 500 హరిమాన్ ఆపిల్ మొక్కలను నాటారు లింగారెడ్డి. 2018 డిసెంబర్‌లో ఆపిల్ మొక్కలు నాటగా, కేవలం ఒక సంవత్సరం లోనే ఎంతో బాగా ఎదిగి ఒక్కో చెట్టుకు 100 వరకు పూత కాయలతో కళకళలాడుతున్న తోటను చూసి సంతృప్తిని



పొందారు. హరిమాన్ శర్మ సూచన మేరకు మొదటి సంవత్సరం వచ్చిన పూత, పిందెలను చెట్టుకు ఒకటి రెండు మాత్రమే వుంచి, మిగతా వాటిని తెంచి వేయటం జరిగింది. అలా పండిన పండ్లు మంచి రుచి, నాణ్యత కలిగి వుండటంతో తాను ధైర్యంగా చేసిన పనికి మంచి ఫలితం వచ్చిందని సంతోషించారు. లింగారెడ్డి సలహాతో పాటు తాను ఇచ్చిన ధైర్యంతో ఈ సంవత్సరం (2020)లో ఉభయ తెలుగు రాష్ట్రాల రైతులకు ఆపిల్ పండ్ల తోటలను విరివిగా పెంచేందుకు అంట్లను సరఫరా చేసింది 'పల్లెసృజన'.

ఈ రెండు సంవత్సరాల ఆపిల్ మొక్కలు పెంచిన అనుభవంతో ఇతరులకు ఎంతో ఉపయోగకరమైన క్రియాశీల సలహాలుగా ఇవ్వటం ఆయన మంచి మనసును చాటుతోందని 'పల్లెసృజన' భావిస్తోంది. ఆపిల్ మొక్కలను గురించి లింగారెడ్డి గారి మాటల్లోనే.... "మొక్కలు మొదట నాటేముందు చూస్తే కేవలం ఒక కొమ్మ, క్రింద వేర్లు మాత్రమే ఉంటాయే అనిపిస్తుంది, కానీ నాటిన 15-20 రోజుల్లోనే చిగుళ్ళు వేస్తాయి. కేవలం 6 నెలలు లేదా ఒక సంవత్సరం వరకు ఈ మొక్కలను జాగ్రత్తగా పరిశీలిస్తూ బ్రతికించుకో గలిగితే ఇక మొక్కకు చావు అంటూ వుండదు. ఎందుకంటే వీటి వేరు వ్యవస్థ చాలా బలమైనది. సాధారణంగా తాటి చెట్టుకు వున్నటువంటి వేరు వ్యవస్థ ఈ ఆపిల్ మొక్కలకు ఉంది. ఇన్ని ఎక్కువ వేర్లు వుండటం వల్ల మొక్కలు నీరు ఎక్కువైనా, తక్కువైనా తట్టుకోగలవు. మొక్కలు డిసెంబర్ రెండవ వారంలో నాటిన తర్వాత మార్చిలో ఎండలు ముదురుతున్న సమయానికే మొక్క బాగా పెరిగింది. నా పొలం కొంత వరకు ఇసుకనేల కావటం వల్ల మొక్కలు పెరుగుతాయో లేదో అనుకున్నాను కానీ నేను అనుకున్న దానికన్నా బాగా పెరిగాయి. ఈ ఎండలకు



మొక్కలు తట్టుకుంటాయో లేదో, ఇవి ఎక్కువ శీతల ప్రదేశాల్లో పండే పంట కాబట్టి ఎందుకైనా మంచిది షేడ్ నెట్ వేయించమని కొందరు రైతులు సలహా ఇచ్చారు. తాను మొక్క రూపకర్త హరిమాన్ శర్మను సలహా అడుగగా, ఏమీ అవసరం లేదు ఎండలు మరీ ఎక్కువగా వుంటే నీరు ఎక్కువగా అందించు, షేడ్ నెట్ అవసరం లేదు, ఆ మొక్కలు అలా ఎండను తట్టుకోగలిగి, దిగుబడి ఇచ్చేలా రూపొందించడం జరిగింది కాబట్టి మీరు భయపడాల్సిన అవసరం లేదు అని చెప్పారు. వారి సూచన మేరకు 3-4 రోజులకోసారి నీరు అందిస్తూ వుండటంతో మొక్కలన్నీ బాగా పెరిగాయి.

ఇప్పటి వరకు తాను నాటిన 500 మొక్కల్లో కేవలం 50 మొక్కలు వరకు మాత్రమే చనిపోయాయి. ఈమాత్రం నష్టం ఏ పంటకైనా వుంటుంది. అందుకే మళ్ళీ మొక్కలు తెప్పించుకుని నాటడం జరిగింది. ఈ మొక్కలు నాటేటప్పుడే ఆపిల్ మన ప్రాంతంలో కొత్త రకం కాబట్టి, 48 డిగ్రీల ఎండను కూడా తట్టుకుని వస్తుంది అని ఇన్నోవేటర్ ఎంత ధైర్యంగా చెప్పినా, ఎందుకైనా మంచిదని ప్రతి 4 చెట్లకు ఒకటి చొప్పున మామిడి మొక్కను కూడా నాటడం జరిగింది. ఒకవేళ ఆపిల్ రాకపోతే మామిడిని పెంచుదాము, ఆపిల్ దిగుబడి బాగా వచ్చిందంటే, మామిడిని ఎక్కువ ఎత్తు పెరగనీయకుండా ప్రూనింగ్ చేసుకుంటూ వుండాలని నిర్ణయించుకున్నాను. కానీ ఇప్పుడు తోటను చూస్తుంటే మామిడితో అవసరం లేకుండానే ఆపిల్ దిగుబడి బాగా వస్తుందన్న నమ్మకం ఏర్పడింది" అంటూ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు బింబారెడ్డి.

ఇంతవరకు తన ఆపిల్ చెట్లకు ఎటువంటి రోగాలైతే పెద్దగా కనిపించలేదు కానీ, ఒక్క 'స్టెమ్ బోరర్' (కాండం తొలిచే పురుగు) ప్రభావం అక్కడక్కడా కనిపించింది కొన్ని చెట్ల కొమ్మలు ఎండిపోయాయి, వాటి నివారణకు కూడా ప్రయత్నిస్తున్నాను అన్నారు. తాను మొక్కలకు పెద్దగా రసాయన పురుగు మందులేవీ కొట్టలేదని, నీటితో పాటు జీవామృతం పంపడం, జీవామృతం, సిపిఆర్ గారి పద్ధతిలో మల్టీ ద్రావణాలను పిచికారి చేశానని, మొక్కలు ఎంతో ఆరోగ్యంగా పెరుగుతున్నాయి అని అన్నారు బింబారెడ్డి. తన తోటలో ఆపిల్ మొక్కలను వరుసల మధ్య 5 మీటర్లు, మొక్కల మధ్య 2.5 మీటర్ల దూరాన్ని పాటించి నాటడం జరిగింది. ఇలా నాటడం వల్ల ఎకరాకు 250 వరకు మొక్కలు నాటవచ్చు అని సూచించారు.

కొందరు రైతులు తన సలహాలు విని, 'డ్రాగన్ ఫ్రూట్' పంటను సాగు చేసి మంచి లాభాలను ఆర్జిస్తున్నారు. అలాగే ఖర్జూర, జీడి మామిడి తోటలను కూడా పెంచే ప్రయత్నం చేస్తున్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్తరకం పంటలను వేసుకుని, నష్టపోకుండా జాగ్రత్త పడాలని సూచిస్తున్నారు బింబారెడ్డి.

గత రెండు సంవత్సరాలుగా పల్లెసృజన వెయ్యికి పైగా హరిమాన్ శర్మ ఆపిల్ మొక్కలను తెలుగు రాష్ట్రాలలో రైతులకు అందించింది. బింబారెడ్డి గారి స్ఫూర్తి, వారిచ్చిన ధైర్యంతో ఈ సంవత్సరం 'పల్లెసృజన' ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 3 వేలకు పైగా మొక్కలు వితరణ చేసింది. అంటే మరో రెండేళ్ళలో మన తెలుగు రాష్ట్రాల్లోనే ఆపిల్ పంట దిగుబడి ప్రారంభమౌతుంది అన్నమాట. అద్భుతమైన ఈ విప్లవానికి కారకులైన ఇన్నోవేటర్ హరిమాన్ శర్మ, వ్యాప్తికి నడుం కట్టిన బింబారెడ్డి గారు ధన్యులు. ●

**మొక్కలు కావలసిన వారు సంప్రదించండి :**

**వీరరాఘవ రెడ్డి, ఫోన్ : 8125799904**

**సుభాష్, ఫోన్ : 9652801700**

**పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం**

[illegible]

[illegible]

[illegible]

# 'పల్లెసృజన'కు రైతు నేస్తం పురస్కారాలు





'రైతునేస్తం' 16వ వార్షికోత్సవం సందర్భంగా ప్రతి యేడాది అందించే "రైతునేస్తం పురస్కారాలు" గౌరవనీయులు భారత ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు గారు ముఖ్య అతిథిగా 'శ్రీ ముప్పవరపు ఫౌండేషన్' మరియు 'రైతునేస్తం' సంయుక్త నిర్వహణలో 2020 డిసెంబర్, 16 తేదీన 'స్వర్ణ భారతి ఫౌండేషన్' ముచింతల్ ప్రాంగణంలో పురస్కారాలు అందజేయడం జరిగింది.

**బ్రిగేడియర్ పోగుల గణేశం గారికి "కృషిరత్న" పురస్కారం:**

'పల్లెసృజన' వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ పోగుల గణేశం గారు గత 16 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో తమ సృజనా శక్తితో తమ కొరకు తయారు చేసుకున్న ఇన్నోవేషన్లను వెలుగులోకి తీసుకు రావటం కోసం కృషి చేస్తున్న విషయం పాఠకులకు విదితమే. ఏమీ చదువు లేకపోయినా ఆ ఇన్నోవేటర్లు తయారు చేసుకున్న పరికరాలు, పరిష్కారాలు, సాంప్రదాయ వైద్యాలు, వ్యవసాయ పురుగు మందులు స్వచ్ఛంద సభ్యుల సహకారంతో వెలుగులోకి తెచ్చి, ఈ ఇన్నోవేషన్లు వీరు మాత్రమే ఉపయోగించుకుంటే చాలదు, సమాజం అంతా వినియోగించుకోవాలి అన్న గొప్ప సంకల్పంతో 'పల్లెసృజన' అనే సంస్థను స్థాపించి, వందలాది మంది మారుమూల ప్రాంతాల ఇన్నోవేటర్లను వెలుగులోకి తెచ్చి, వారికి జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు కలిగేలా కృషి చేస్తున్నారు. ఆ ఇన్నోవేటర్లు తయారు చేసిన వాటిని తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలను రైతులు పొందేలా చేసిన కృషికి ఈ పురస్కారాన్ని అందజేసింది.

పద్మశ్రీ ఐ.వి. సుబ్బారావు గారి పేరున "కృషిరత్న" పురస్కార గ్రహీత బ్రిగేడియర్ గణేశం గారు మాట్లాడుతూ "ఈ పురస్కారం నాకు ఇచ్చింది కాదు. 'పల్లెసృజన' కుటుంబానికి ఇచ్చిన పురస్కారంగా ప్రతి కార్యకర్త భావించాలి" అన్నారు. 'రైతు నేస్తం' అందజేసిన ఈ ప్రోత్సాహం పల్లె రైతాంగానికి చేయూతనిచ్చిన, వారి పెట్టుబడి ఖర్చులను తగ్గించేందుకు ఇంకా ఎన్నో ఇన్నోవేషన్లను వెలుగులోకి తెచ్చేందుకు ఉత్సాహాన్ని అందజేసింది" అన్నారు.

**నిజామాబాద్ జిల్లా రైతు 'చిన్ని కృష్ణుడు' గారికి 'రైతునేస్తం' పురస్కారం:**

'పల్లెసృజన' పాఠకులకు 115 రకాల దేశీ వరి వంగడాలను సేకరించి, తాను స్వయంగా పండించి, విత్తనాలను రైతు లోకానికి అందజేస్తున్న 'చిన్ని కృష్ణుడు' గారిని గురించి విదితమే. గత సంచికలలో వీరు దేశీ వరి విత్తనాలను సేకరించిన విధానం, పండించి, రైతులకు వితరణ చేస్తున్న విధానాలను గురించి ప్రచురించిన వ్యాసం గుర్తుండే వుంటుంది. మన ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 115 రకాల దేశీయ వరి విత్తనాలు కలిగిన ఏకైక రైతు చిన్ని కృష్ణుడు గారు అనటంలో అతిశయోక్తి లేదు. దేశీయ విత్తనాలకు ఇంతటి ప్రాధాన్యత కల్పిస్తున్న చిన్ని కృష్ణుడు గారికి 'రైతునేస్తం' తమ ప్రత్యేక పురస్కారం అందించటం ద్వారా వారిలో ఎంతో ఉత్సాహాన్ని నింపింది.

భారత ఉపరాష్ట్రపతి శ్రీ వెంకయ్య నాయుడు, రైతునేస్తం వ్యవస్థాపకులు 'పద్మశ్రీ' పురస్కార గ్రహీత శ్రీ వెంకటేశ్వర రావు గార్ల చేతుల మీదుగా మన 'పల్లెసృజన' కుటుంబ సభ్యులు ఈ పురస్కారం అందుకోవడం పాఠకులకు, ఇన్నోవేటర్లకు, అభిమానులకు ఎంతో సంతోషంగా ఉందని భావిస్తున్నాం. 'పల్లెసృజన'ను గుర్తించి వీరికి ఈ పురస్కారాలను అందజేసిన రైతునేస్తం యాజమాన్యానికి ధన్యవాదములు. -ఎడిటర్.

# 10వ జాతీయ ద్వైవార్షిక పోటీ విజేతలు




ఎన్.ఐ.ఎఫ్. వారు 2019లో నిర్వహించిన 10వ జాతీయ స్థాయి ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో జాతీయ బహుమతి పొందిన విజేతల వివరాలు

- ఎన్.ఐ.ఎఫ్. వారి వ్యాసాలకు స్వేచ్ఛానువాదం : [illegible]

**రాష్ట్రస్థాయి పురస్కారం - మణిపూర్**

**ఖా అనిమాఖాయ్ ఫాజ - సాంప్రదాయ కాలీఫ్లవర్ రకం**

పేరు :కెయిషమ్ థోయిబి దేవి

నివాసం : బిష్ణుపూర్, మణిపూర్



మణిపూర్ రాష్ట్రానికి చెందిన 51 సంవత్సరాల కెయిషమ్ థోయిబిదేవి ప్రకృతి సేద్య పద్ధతులలో సాంప్రదాయ పంటలు పండించే ప్రగతిశీల మహిళా వ్యవసాయదారు. ఆమె తన పొలంలో సమీకృత వ్యవసాయ పద్ధతిలో సాంప్రదాయ పద్ధతులలో దేశవాళి వరి, క్యాబేజి, కాలిఫ్లవర్ లాంటి ప్రధాన పంటలు పండిస్తూ వుంటారు.

ఆమెకి తన అత్తగారి తరఫునుండి ఈ కాలీఫ్లవర్ విత్తనాలు దొరికాయి. ఇది జరిగి సుమారు 20 సంవత్సరాలైంది. ఆమె ఆ విత్తనాలను పొలంలో చల్లగా పంట చేతికొచ్చే సమయానికి ఆమె కొన్ని విషయాలు గమనించింది. పంట త్వరగా రావటం ఒక ఎత్తైతే, తెల్లగా, ముద్దగా ఉండే కాలీఫ్లవర్‌లు ఏ చీడ పీడలు లేకుండా ఉండటం గమనించింది. ఆమె ఉన్నవాటిల్లోకెల్లా శ్రేష్ఠమైనవి ఉంచుకొని, విత్తనాలు సేకరించి, మరుసటి సంవత్సరం మళ్ళీ కాలిఫ్లవర్ నాటింది. ఈవిధంగా ఆమె చాలా సంవత్సరాలు ప్రయోగాలు చేసి, 1998 నాటికి ఒక రకాన్ని స్థిరపరిచింది.



ఈ రకం విత్తనం సాధారణ రకాలకన్నా ముందుగా అంటే జూలై మొదటి వారంలోనే విత్తుకోవచ్చు. తెల్లగా గుత్తులుగా ఉండే మొగ్గలతో అతి పెద్దగా కాక, అలాగని చిన్నవిగా కాక మధ్యస్థంగా ఉండి సుమారు 750 గ్రా. తూగే కాలీఫ్లవర్‌లు వస్తాయి. ఆకులు పాక్షికంగా కప్పబడి ఉండటంతో చాలాకాలం తాజాగా ఉంటాయి. మంచి రుచి ఉండి ఏ చీడ పీడలు సోకకుండా దృఢంగా ఉంటాయి. కనుక మార్కెట్‌లో మంచి ధర పలుకుతుంది. మంచి రంగు, రుచి ఉండటమే కాక, త్వరగా కాపుకు రావటం వల్ల మార్కెట్‌లోని ఇతర రకాలు వచ్చేలోపే వీటిని రైతులు మార్కెట్‌కు తరలించడం వలన మంచి ధర లభించి అధిక లాభాలను ఆర్జిస్తున్నారు.

2006వ సంవత్సరం నుండి ఈ రకాన్ని దగ్గరి బంధువులకు, చుట్టు పక్కల రైతులకి ప్రయోగార్థం ఇవ్వగా, చాలా మంది రైతులు ఈ రకం కాలీఫ్లవర్‌లను పండించి ఎక్కువ లాభాలు ఆర్జిస్తున్నారు. లాంగోహిక్ మరియు నాంబోల్ ప్రాంతాలలోని చాలామంది రైతులు ఈరకం కాలీఫ్లవర్ పండించి అధిక లాభాలను పొందుతున్నారు.

నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారి సహాయంతో ఇంఫాల్ లోని కేంద్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం దీన్ని పరీక్షించి, త్వరగా కాపుకి రావటం, దీని కారణంగా మార్కెట్‌లో అధిక లాభాలు రావటం, మంచి రుచి, చీడ పీడలు లేకపోవటం లాంటి లక్షణాలని ధృవీకరించారు.

ఈ రకానికి ఢిల్లీలోని పిపివి & ఎఫ్ఆర్ అధికారుల ద్వారా రిజిస్ట్రేషన్ కొరకు 2002లోనే దరఖాస్తు చేయటం జరిగింది.

మంచి దేశవాళీ కాలీఫ్లవర్ రకాన్ని అందించిన కియుషమ్ ధోయిబేని కి ఎన్ఐఎఫ్ వారు 2019లో తమ 10వ జాతీయ ద్వైవార్షిక ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలో రాష్ట్ర స్థాయి బహుమతి ఇచ్చి సత్కరించారు.

**రాష్ట్ర స్థాయి పురస్కారం - మహారాష్ట్ర**

**సరిత నల్ల ద్రాక్ష మరియు నానాసాహెబ్ ఊదా సీడ్‌లెస్ ద్రాక్ష**

పేరు : **దత్తాత్రేయ నానాసాహెబ్ కాలే**


నివాసం : షోలాపూర్, మహారాష్ట్ర

55 సంవత్సరాల దత్తాత్రేయ నానాసాహెబ్ కాలే మహారాష్ట్రలోని షోలాపూర్‌లో ఒక ద్రాక్ష పండించే అభ్యుదయ రైతు. ఈయన 12వ తరగతి వరకు చదువుకొన్నారు. తర్వాత తన తండ్రి దివంగత నానాసాహెబ్ కాలే గారి అడుగు జాడల్లో తాను కూడా ద్రాక్ష పెంపకం కొనసాగించారు. ఈయన తండ్రిగారు 1980లలో 'శరద్' అనే గింజలు లేని ద్రాక్ష అభివృద్ధి చేసి చాలా పేరు గడించారు. మన దత్తాత్రేయ తనకున్న 25 ఎకరాల ద్రాక్ష తోటలో తన కుటుంబం అభివృద్ధి చేసిన ద్రాక్ష రకాలను పండిస్తుంటారు. ఈయన ఒక ద్రాక్ష నర్సరీ నడుపుతూ దాని ద్వారా మంచి రకాలైన ద్రాక్ష రకాల అంట్లను విక్రయిస్తుంటారు. ఇదే కాక, తాను రూపొందించిన 'సరిత' మరియు నానాసాహెబ్ ఊదా రంగు ద్రాక్షతో చేసిన కిస్‌మిస్ (ఎండు ద్రాక్ష)ని కూడా విక్రయిస్తుంటారు.



1994 ప్రాంతంలో తాను వేసిన శరద్ రకం ద్రాక్షలో ఒక తీగ బాగా ఏపుగా పెరిగి పెద్ద పెద్ద పళ్ళతో, మంచి రంగుతో భారీ గుత్తులు కాయటం గమనించారు. ఆ తీగను ఇంకొక మేలు రకం తీగలతో గ్రాఫ్టింగ్ చేసి, 3 సంవత్సరాల తరువాత మంచి ఫలితాలు వస్తుండటంతో, అదేవిధంగా అనేక ప్రయోగాలు చేసి చివరికి 2003వ సంవత్సరంలో ఒక రకాన్ని స్థిరీకరించారు. దీనికి తన తల్లిపేరు 'సరిత కాలే' పేరున 'సరిత' అని నామకరణం చేశారు. సరిత రకం పళ్ళు పొడుగ్గా వుండి ఎక్కువ బరువుండి మార్కెట్‌లో మంచి ధర పలుకుతున్నాయి.

కొన్ని సంవత్సరాల తరువాత తాను రూపొందించిన సరిత రకం ద్రాక్ష తీగలలో కొన్ని 25 మి.మీ. సైజుతో పొడుగ్గా వుండే ద్రాక్ష కాయటం గమనించారు. నాటినుండి అనేక సంవత్సరాలు వాటిపై ప్రయోగాలు చేసి తన తండ్రిగారి పేరున 'నానాసాహెబ్ ఊదారంగు ద్రాక్ష' అని నామకరణం చేశారు.





ఇది చిన్న పండు సువాసనతో ఎక్కువ తియ్యగా ఉండటమే కాక, పలుచని తోలుతో విదేశాలకు ఎండు ద్రాక్షగా ఎగుమతి చేయటానికి వీలుగా ఉంటాయి.

కృషి విజ్ఞాన కేంద్రం, షోలాపూర్ నిపుణులు 'సరిత' మరియు 'నానాసాహెబ్ కాలే' రకాలని పరీక్షించి చూసి ఇవి రెండు నాణ్యమైన అధిక ఉత్పత్తి సాధించి, ఎక్కువ తియ్యగా ఉండి మార్కెట్లో అధిక ధరకు అమ్ముడాలు జరుపుతాయని చెప్పారు. చుట్టుపక్కల గ్రామాల రైతులు కూడా కితాబు ఇచ్చారు. సరిత రకం స్థానిక మార్కెట్లో మంచి ధర పలుకుతుంటే, నానాసాహెబ్ రకం విదేశాలకి ఎగుమతులు చెయ్యటానికి చాలా అనువుగా ఉంటుంది.

ఈ 'నానాసాహెబ్ ఊదారంగు విత్తనాలు లేని ద్రాక్ష' రకం మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లో 21,000 హెక్టార్లలో రైతులు వేస్తున్నారు. కేవలం మహారాష్ట్రలోనే దాదాపు 90 శాతం మంది రైతులు ఈ రకాన్ని పండిస్తున్నారంటే దీనికెంత ప్రాచుర్యం, లాభం ఉన్నాయో



గ్రహించవచ్చు. ఇక 'సరిత గింజలు లేని ద్రాక్ష' రకం మహారాష్ట్రలోని నాసిక్, షోలాపూర్‌లలో విరివిగా 17 వేల హెక్టార్లలో పండిస్తున్నారు. ఎన్ఐఎఫ్ వారి సహకారంతో ఈ రెండు రకాలకి పిపివి & ఎఫ్ఆర్ రిజిస్ట్రేషన్‌కి దరఖాస్తు చేయటం జరిగింది.

ద్రాక్ష రైతులకి మంచి రుచికల లాభసాటి ధర పలికే ఈ రెండు రకాలైన సరిత, నానాసాహెబ్ గింజలు లేని ద్రాక్ష రకాలు అందించినందుకుగాను దత్తాత్రేయ నానాసాహెబ్ కాలేకి 2019 సంవత్సరంలో ఎన్ఐఎఫ్ వారు తమ 10వ జాతీయ ద్వైవార్షిక ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో రాష్ట్ర స్థాయి బహుమతి ఇచ్చి సత్కరించారు.

**రాష్ట్ర స్థాయి పురస్కారం - ఒడిస్సా**

**కూరగాయలు, వరి పంటలను చీడలు, పురుగుల నుంచి రక్షించే మూలికా ద్రవం.**

పేరు : **జ్యోత్స్నమయి పాత్ర**
ఊరు : కియోంఝర్, ఒడిస్సా



18 సంవత్సరాల జ్యోత్స్నమయి పాత్ర పొలిటికల్ సైన్స్‌లో డిగ్రీ చదువుతున్న ఇన్నోవేటర్. ఆమె 8వ తరగతి చదువుతుండగా వాళ్ళ ఇంట్లో ఒక గులాబీ మొక్క వాడిపోయి పూలు పూయటం మానేసింది. ఆ గులాబీ మొక్క పక్కనే ఒక పళ్ళు కాసే తీగ (పేటెంటు పట్టానికి దరఖాస్తు చేసినందుకుగాను పేరు చెప్పటం కుదరటం లేదు) ఉంది. దానికి కాసిన పళ్ళు ఎండిపోయి గులాబీ చెట్టు మొదలువద్ద పడి కుళ్ళిపోయి భూమిలో కలిసి పోయాయి. కానీ విచిత్రంగా గులాబీ చెట్టు మళ్ళీ చిగురించి మంచి పూలు పూయసాగింది. దాంతో చిన్న వయస్సులో వున్న కుతూహలం కొద్దీ ఊళ్ళో అటువంటి పళ్ళు తాను సేకరించి, చీడ పురుగులు పట్టిన వరి పొలాల్లో, పూల మొక్కలు మరియు కాయగూరల చెట్ల మొదళ్ళకి దగ్గరగా వేసింది. విచిత్రంగా ఆ పంటలో చెట్ల మొక్కలన్నీ ఆరోగ్యంగా బలిష్ఠంగా పెరగసాగాయి. ఆమె గత 4-5 సంవత్సరాలనుంచి ఇదేవిధంగా ప్రయోగాలు చేస్తూ వస్తోంది.

ఆమె ఆ పళ్ళ రసాలతో చేసిన ప్రయోగం తక్కువ

పరిమాణంలో (పెద్ద పెద్ద పొలాలలో కాక) రసం రూపంలో గానీ, ద్రావకం రూపంలో గాని, పొడి రూపంలో గానీ వాడవచ్చు లేదా పళ్ళ రసంతో వ్యాధి సోకిన చెట్టు మొదట్లో పోసిపెట్టవచ్చు. ఈ మందు విషపూరితం, వేడి కనుక దీనిని వాడేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెపుతోంది జ్యోత్స్న.

జ్యోత్స్నకు 2019 సంవత్సరంలో ఎన్ఐఎఫ్ వారు తమ 10వ జాతీయ ద్వైవార్షిక ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో రాష్ట్ర స్థాయి బహుమతి ఇచ్చి సత్కరించారు.



**రాష్ట్ర స్థాయి పురస్కారం - ఒడిస్సా**

**చింతగింజలు తీసే పరికరం**

పేరు : దయారామ్ విహారామ్ చౌహాన్

నివాసి : జయపుర్, ఒడిస్సా.



66 సం.ల దయారామ్ వృత్తిరీత్యా చిన్న యంత్రాలను తయారు చేసేవారు. కానీ 1974లో తన పని వదిలేసి తన తండ్రి వ్యాపారంలో చేరి, దైర్ఘ్య దిమ్మలు, ఎలక్ట్రిక్ బోర్డులు చేసే పని ప్రారంభించారు. కంపెనీ పేరుని కూడా "హిందూస్థాన్ ఐరన్ అండ్ ఫుడ్ ఇండస్ట్రీ" అని మార్చారు. 1979వ సంవత్సరంలో ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయం ప్రకారం తక్కువ ఖర్చుతో వ్యవసాయ యంత్రాలు చెయ్యాలన్నప్పుడు వీరు కూడా ఆ ప్రక్రియ మొదలు పెట్టారు. ఈ క్రమంలోనే వివిధ రకాల గింజలను ఒలిచే యంత్రం, జీడిపప్పు ఒలిచే యంత్రాలను రూపొందించారు. చాలా యంత్రాలు కావలసిన వారికి విక్రయించారు కూడా. ఇదే సమయంలో స్థానికంగా పనిచేసే లాభాపేక్ష లేని ఒక స్వచ్ఛంద సంస్థవారు దయారామ్‌ను పండు చింత లోంచి గింజలను వేరే చేసే యంత్రం తయారు చెయ్యవలసిందిగా కోరారు.

వారు గింజలను తీసే యంత్రాలు ఇంతకు ముందే చేసి ఉండటం వలన, ఎక్కువ శ్రమ లేకుండానే ఆ యంత్రాన్ని తయారు చేసి పెట్టారు. దానిలో రెండు భాగాలుంటాయి. ఒకటి పండు చింతని చితక్కొట్టేది, రెండోది గింజలను చింతపండుని వేరు వేరుగా సేకరించే భాగం. చింతకాయల నుంచి చింత గింజలను వేరు చెయ్యటానికి రెండు రోలర్ల వంటివి వాడారు. వాటిమధ్య చింతకాయలు వెళ్ళగానే అవి చితికిపోయి, గింజలు బైటకొచ్చేస్తాయి. వేరు చేయబడ్డ చింతగింజలను పారవేయకుండా విత్తనాలకి, వాణిజ్య వినియోగాలకి వాడుతారు. చింతపండును విడిగా తీసి అచ్చులు వేసుకొని విక్రయించుకోవచ్చు.

ఈ చింతగింజలు వేరు చేసే యంత్రం ఖరీదు రూ. 28,000 వరకు వుంటుంది., బరువు సుమారు 50 కిలోలు వుంటుంది. ఈ యంత్రం చేతితో లేదా కరెంటు సహాయంతో కూడా పని చేయించుకోవచ్చు. చేతితో పనిచేసే యంత్రంతో గంటకు 5–6 కిలోల పండు ఒలుచుకోవచ్చు, అదే కరెంటుతో పని చేసే యంత్రంతో 10 కిలోల వరకు పండు వొలుచుకోవచ్చు. భువనేశ్వర్ లోని ఎస్ఎల్ఎస్ఓటిఐసి వారు దీనిని పరీక్షించి ఈ యంత్రం 72 శాతం సమర్థతతో పని చేస్తుందని నిర్ధారించారు.

దయారామ్ ఇటువంటి యంత్రాలు దాదాపు 200 వరకు విక్రయించారు. దీనిలో 25 యంత్రాలు జయ్‌పూర్ లోని సాధన ఫౌండేషన్ వారు కొనుగోలు చెయ్యగా మరో 80 యంత్రాలు భువనేశ్వర్ లోని ట్రైఫెడ్ సంస్థ వారు కొనుగోలు చేశారు.

ఎంతో కష్టమైన, ఖర్చుతో కూడుకొని, ఎక్కువ మంది పనివాళ్ళు అవసరమయ్యే పనికి ఒక చిన్న యంత్రంతో

పరిష్కారం చూపిన దయారామ్‌కి 2019 సంవత్సరంలో ఎన్ఐఎఫ్ వారు తమ 10వ జాతీయ ద్వైవార్షిక ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలో రాష్ట్ర స్థాయి బహుమతి ఇచ్చి సత్కరించారు.

**రాష్ట్ర స్థాయి పురస్కారం – హిమాచల్ ప్రదేశ్**

**పంటలకు సోకే పురుగుల నియంత్రణకి మూలికా మందు**

పేరు :రోషన్‌లాల్

నివాసం : కులు, హిమాచల్ ప్రదేశ్.



రకరకాల చిన్న చిన్న పురుగులు పంటలను, కూర గాయలు, పళ్ళనీ చెట్టుమీద ఉండగానే, లేదా కోసిన తరువాత తీవ్రమైన నష్టాన్ని కలుగజేస్తాయి. హిమాచల్ ప్రదేశ్ లోని కుల్లు ప్రాంతానికి చెందిన 54 సంవత్సరాల రోషన్ లాల్ అనే అభ్యుదయ రైతు స్థానికంగా దొరికే కొన్ని మొక్కలు, ఆకులు రసాన్ని ఒక మిశ్రమంగా తయారు చేసి సాధారణంగా వివిధ దశలలో గోధుమ, బార్లీ మరియు కాయగూరలకు హాని కలిగించే పురుగులను నిర్మూలించి/ నియంత్రించేలా కనుగొన్నారు. కేవలం ప్రాథమిక విద్య వరకు మాత్రమే చదువుకున్న రోషన్‌లాల్ కొన్ని దశాబ్దాలుగా వ్యవసాయం చేస్తున్నారు.

తాను సేద్యం చేసేటప్పుడు పంటలకి కొన్ని పురుగులు, కీటకాలు తీవ్రమైన నష్టం కలుగజేయ్యటం గమనించిన రోషన్‌లాల్, తనకున్న పరిజ్ఞానంతో వివిధ మొక్కలు, మూలికలతో ప్రయోగాలు చేసి, చివరికి చెట్ల బెరడు, ఆకులు, పళ్ళు కలిపిన రసాలు తయారు చేశారు. (మేధో సంపత్తి హక్కులకై దరఖాస్తు చేయటంతో బెరడు, ఆకులు, మొక్కల పేర్లు చెప్పటం కుదరదు) తాను చేసిన ద్రావణాన్ని పలుచగా చేసి (నీరు కలిపి) వాడటంతో రసం పీల్చే పురుగులు, కాండం తొలిచే పురుగులు, గోధుమ, బెండ, కాలీఫ్లవర్, వంకాయ, బార్లీ లాంటి పంటలలో బాగా చాలా మంచి ఫలితాలు వచ్చాయి. ఈయన ఈవిధంగా ఎన్నో సంవత్సరాల నుంచి సేంద్రియ పద్ధతిలో కీటకాలను నాశనం చేసే రసాలపైతో ప్రయోగాలు చేస్తూనే ఉన్నారు. ఒక్కసారి తయారు చేసుకొన్న రసాయనం 5-6 నెలల వరకు నిలువ ఉంచుకొని వాడుకొన్నా దాని పనితనంలో ఎటువంటి మార్పు ఉండదని చెప్తున్నారు రోషన్‌లాల్.

ఎన్.ఐ.ఎఫ్. వారి సహాయంతో వారణాసి లోని బనారస్ హిందూ విశ్వ విద్యాలయం వారి ఇన్స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ ఎంటమాలజీ మరియు జూవాలజీ డిపార్ట్‌మెంట్‌లోని నిపుణులు బెండకు సోకే పురుగులపై వివిధ ప్రయోగాలలో భాగంగా బెండ చెట్లపై వివిధ దశలలో రెండుసార్లు మందు పిచికారి చేయగా బెండకు సోకే దాదాపు అన్ని రకాల పురుగులపై చాలా బాగా పనిచేసి నశింపజేసింది. వారి ప్రయోగాలలో తెల్లదోమ 64-71%, లీఫ్ హాపర్స్ (ఆకురసం పీల్చే పురుగు) 67-75%, అంటి పురుగులు, తామర పురుగులు 45%, కాయ తొలుచు పురుగు 47 శాతం మేరకు నిలువరించ గలుగుతుందని నిర్ధారించారు. ఈ నిపుణులతో బెండపై చేసిన ఇంకొక ప్రయోగంలో రైతు చెప్పిన మోతాదులో మందు వాడితే 54% నియంత్రణ జరిగింది (అన్ని రకాల పురుగులు) అదే రోషన్‌లాల్ చెప్పిన దానికన్నా సగం మోతాదులో వాడితే 59% పురుగు నివారించగలిగారు. అదే కొన్ని బెండ పంటలలో రోషన్‌లాల్ చెప్పిన దానికన్నా రెండింతలు మోతాదులో మందు వాడితే (పిచికారి చేస్తే) 67% పురుగులు నివారించ గలిగారు. అంటే బెండ పంట ఆధారంగా ఎంత మందు వాడాల్సివస్తుందో నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. ఈ నిపుణులు గమనించిన మరొక విషయం ఏమిటంటే, ఈ రసాయనం శత్రు పురుగులకు మాత్రమే హాని చేస్తుంది కాని, మిత్ర పురుగులైన తూనీగలు, సాలీళ్ళు, అల్లిక పురుగులు మొదలైన వాటికి ఎటువంటి హాని చెయ్యదు.

రైతుల పొలాలకు హాని చేసే పురుగుల నుంచి పంటని సేంద్రియ పద్ధతిలో కాపాడుకునే మూలికా రసాయనం కనిపెట్టిన రోషన్‌లాల్‌కి 2019 సంవత్సరంలో ఎన్ఐఎఫ్ వారు 10వ జాతీయ ద్వైవార్షిక ఇన్నోవేషన్ & సాంప్రదాయజ్ఞాన పోటీలో రాష్ట్రస్థాయి బహుమతితో సత్కరించారు.

**ఈ ఇన్నోవేషన్ల కావలసిన వారు సంప్రదించండి :**

**సుభాష్, ఫోన్ : 96528 01700**

## 'అల్లాడి ప్రభాకర్' మరో ఇన్నోవేషన్

# పేషెంట్ లిఫ్టర్ షీట్



– పల్లె వీరరాఘవ రెడ్డి

'పల్లెసృజన' పాఠకులకు చిరపరిచితులైన తెలంగాణ రాష్ట్రానికి చెందిన జగిత్యాల జిల్లా, మెట్‌పల్లి నివాసి అయిన ఇన్నోవేటర్ "అల్లాడి ప్రభాకర్" మరో నూతన ఆవిష్కరణతో పాఠకుల ముందుకు వచ్చారు. 2017 మే–జూన్ 'పల్లెసృజన' సంచికలో "ప్రయోగాల ప్రభాకర్" అన్న పేరుతో వచ్చిన కథనంలో అల్లాడి ప్రభాకర్ చేసిన ఎన్నో రకాల ఇన్నోవేషన్‌లను గురించి పాఠకులకు గుర్తుండే వుంటుంది.

అతను ఇప్పటికే సూర్యునికి అభిముఖంగా సోలార్ ప్యానల్‌లు తిరిగేలా చేసిన ఇన్నోవేషన్, నిస్సహాయుల కొరకు అన్ని సౌకర్యాలు గల మంచం, బోరు బావుల్లో సబ్‌మెర్సిబుల్ పంపును పైకు తీయటానికి సులువైన ఇన్నోవేషన్, 360 డిగ్రీలు చుట్టూ తిరిగే ఇంటి కూలర్, కరెంటు స్తంభాలను ఎక్కే చెప్పులు, మురుగునీటి కాలువల్లో ఇంకుడు గుంతలు ఇంకా



ఎన్నో రకాల ఇన్నోవేషన్‌లను ఇప్పటికే సమాజానికి అందించారు. వాటివల్ల ఎంతోమంది తమ పనులను సులభతరం చేసుకుని వాటిని ఆనందంగా ఉపయోగిస్తున్నారు. ఇందులో కొన్నింటిని అంతర్జాతీయంగా కూడా 'అమెజాన్' ఇంటర్‌నెట్ మాధ్యమంగా అమ్మగలుగుతున్నారు.

ప్రస్తుతం అల్లాడి ప్రభాకర్ చేసిన మరో ఇన్నోవేషన్ సులభంగా పేషెంట్‌ను తీసుకు వెళ్ళే "పేషెంట్ లిఫ్టర్ షీట్". ఈ షీట్ సహాయంతో వ్యాధిగ్రస్తులను సులభంగా స్ట్రెచర్ పైకి మార్చి, ఆసుపత్రి మంచంపైన, కుర్చీలోన లేదా ఎక్కడికైనా సులభంగా తీసుకు వెళ్ళవచ్చు. తిరిగి సులభంగా పేషెంట్‌కు కష్టం కలగకుండా మంచం పైకి మార్చవచ్చు. ఆ తరువాత షీట్‌ని ఒక పరుపు లాగా మడ్చి ఒక మూలన పెట్టవచ్చు.

సాధారణంగా ఆసుపత్రుల్లో స్ట్రెచర్ ఒక ఇనుప రేకుతో తయారు చేయబడి వుంటుంది. అది ఖరీదు కూడా ఎక్కువ కావడమే కాక, దాన్ని అవసరం లేనప్పుడు తీసి వుంచడానికి ఎక్కువ స్థలాన్ని ఆక్రమిస్తుంది. కానీ ప్రభాకర్ తయారు చేసిన షీట్ ఒక పరుపులాగా వుంటుంది. దీన్ని పని అయిపోయిన వెంటనే ఒక దుప్పటిలాగా మడత వేసి తీసి పెట్టుకోవచ్చు. దీని ఉపయోగాలు తెలుసుకుందాం.

1. వృద్ధులు, దివ్యాంగులు మరియు ఏదేని సందర్భంలో మనిషి నడవలేని పరిస్థితిలో వున్న వారిని ఆసుపత్రికి గానీ, ఇంట్లో





ఒక చోట నుండి మరో చోటుకు తీసుకు వెళ్ళడం ఎంత కష్టమైన పనో అందరికీ తెలిసిందే.

2. అలాగే బెడ్ నుండి కుర్చీమీదకి, తిరిగి బెడ్‌పైకి, క్రింద నుండి కుర్చీ మీదికి పేషెంట్‌లను మార్చడం అంత సులభం కాదు. సహాయం చేసే వారికి మరియు పేషెంట్ కు ఇబ్బందిగా వుంటుంది.
3. ఇలాంటి వారికోసం ఒక పేషెంట్ లిఫ్ట్ షీట్ తయారు చేయడం జరిగింది. దీన్ని మడత పెట్టుకుని ఎక్కడికైనా చేతిలో పట్టుకుని తీసుకెళ్ళే విధంగా వుంటుంది.
4. ఈ షీట్ పైన పేషెంట్‌ను పడుకోబెట్టి సునాయాసంగా తీసుకు వెళ్ళవచ్చు.
5. దీనితో 150 కిలోల బరువు గల పేషెంట్‌ను కూడా నలుగురు వ్యక్తులు సునాయాసంగా తీసుకు వెళ్ళవచ్చును.
6. ఇద్దరు, ముగ్గురు లేదా నలుగురు వ్యక్తులు పట్టుకునేలాగా హ్యాండిల్స్ అమర్చబడి వుంటాయి.
7. ఈ షీట్‌ను ముఖ్యంగా ఇంట్లోగాని, అంబులెన్స్‌లోకి ఎక్కించేటప్పుడు మరియు వ్యక్తిగతంగా ట్రావెలింగ్ సందర్భంలో కారు, బస్సు, ట్రైన్ మరియు విమాన ప్రయాణాల్లో సౌకర్యవంతంగా వినియోగించుకోవచ్చు.

ఈ పేషెంట్లను తరలించే షీట్ ఖరీదు కేవలం రూ. 2,000/- మాత్రమే. ఎక్కువ రోజులు పని చేసేలా నాణ్యంగా తయారు చేయబడింది. ప్రతి ఆసుపత్రి యాజమానులు వీటిని తీసుకున్నట్లయితే వారి ఆసుపత్రులలో స్ట్రెచర్‌లను వుంచటానికి ప్రత్యేకమైన స్థలం అవసరం ఉండదు. పైగా పేషెంట్లను తరలించడం కూడా ఎంతో సులువుగా వుంటుంది. ఎక్కడైనా ప్రమాదం జరిగిన స్థలం నుండి రోగులను తరలించడం, వాహనం లోకి, ఆ తర్వాత వాహనం నుండి మోసుకు వచ్చి ఆసుపత్రి పడుపు పైకి చేర్చడం కూడా ఎంతో సులువు. అన్ని అంబులెన్స్‌లు, పోలీసు గస్తీ వాహనాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సహాయపడే సంస్థలు, హోటళ్లు, కళాశాలలు, ప్రథమ చికిత్స అందించే పారా మెడికల్ సిబ్బంది లాంటి వారంతా షీట్‌ను తప్పక తమదగ్గర ఉంచుకోవాలి.

ప్రభాకర్ తయారు చేసిన ఈ పేషెంట్లను తరలించే షీట్‌ను హైదరాబాద్ లోని ఒక ఆసుపత్రిలో ప్రయోగాత్మకంగా పరిశీలించడం కూడా జరిగింది. ఆసుపత్రి యాజమానులు, పేషెంట్లను తరలించే సిబ్బంది కూడా ఇది చాలా బాగుందని కితాబు ఇవ్వటం జరిగింది. ఏదియేమైనా గతంలో 'ప్రయోగాల ప్రభాకర్' అన్న 'పల్లెసృజన' మాటకు ఊతం అందిస్తూ నిత్యం ఏదో ఒక కొత్త ఇన్నోవేషన్‌తో ముందుకు వస్తున్న అల్లాడి ప్రభాకర్‌ను 'పల్లెసృజన' అభినందనలు తెలియజేస్తోంది. పదిమందికి పనికి వచ్చే ఈ ఇన్నోవేషన్ జాతీయ స్థాయి గుర్తింపుకు, ప్రభుత్వాలు దీన్ని కొనుగోలు చేసే ప్రయత్నాలను 'పల్లెసృజన' కృషి చేస్తున్నది. ●

**ఇన్నోవేటర్ అల్లాడి ప్రభాకర్, ఫోన్ : 9440037475**

# డా. ఎపిజె అబ్దుల్ కలాం 'ఇగ్నైట్-2019' పోటీ విజేతలు



– 'ఎన్.ఐ.ఎఫ్.' వారి వ్యాసాలకు
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

**నిద్రలో నడకను కనిపెట్టి, నివారించే సాధనం**

విద్యార్థి పేరు : **శివమ్ అమృతేష్**, 11వ తరగతి, సంస్కార భారతి గ్లోబల్ స్కూల్, ఫుల్‌పారస్, మధుబని, బీహార్.



శివమ్ అమృతేష్ నిద్రలో నడిచే రోగం ఉన్న వారికని దానిని కనిపెట్టి నివారించే సాధనాన్ని డిజైన్ చేశాడు. ఇది చేతికి ధరించేలా వుంటుంది. నడవటాన్ని కనిపెట్టినప్పుడు యిది పని చెయ్యటం ప్రారంభించి చిన్నపాటి కరెంట్ షాక్‌లా



యిచ్చి వ్యక్తిని మేలుకొలుపుతుంది. మల, మూత్రాలకని శౌచాలయానికి వెళ్ళినప్పుడు దీనిని తాత్కాలికంగా నిలిపివేయవచ్చు. దీనిని ఉదయం నిద్ర లేవటానికి అలారంలా కూడా ఉపయోగించుకోవచ్చు.

బయట మైదానాలలో ఆటలాడాలంటే ఇష్టం వున్న శివం జాతీయ స్థాయిలో ఫుట్‌బాల్ ఆటగాడు. ఇతనికి చిత్రలేఖనం, అదీ ప్రకృతి దృశ్యాలని చిత్రించటం, వ్యాసరచన పోటీలలో పాల్గొనాలన్నా చాలా ఉత్సాహం. పెద్దయ్యాక ఇన్నోవేటర్ – వ్యాపారవేత్తవ్వాలని కోరిక ఇతనిది.

**పూలు కుట్టి, పాక్ చేసే సెమీ ఆటోమేటిక్ పరికరం :**

విద్యార్థి పేరు : ఎ.జె. సూర్య, ఎస్. వెంకటేశ్వరన్, ఆర్.కె. వేణురామ్, 12వ తరగతి, విద్యామందిర్ సీనియర్ సెకండరీ





స్కూల్, మైలాపూర్, చెన్నయ్, తమిళనాడు.

ఈ ముగ్గురూ సంయుక్తంగా ఆలోచించి తయారు చేసిన పరికరం కాలితో పెడల్ నొక్కితే పని చేసే విధంగా రూపొందించబడింది. కాలితో పెడల్ నొక్కితే పూలు దారంకు దగ్గరగా వస్తాయి. తరువాత దారం వాటిని ముడివేసి, మాలగా తయారు చేస్తుంది. పూలు కట్టటం / కట్టడం రానివారికి లేదా చేతులకి నొప్పికి ఇబ్బంది పడ్డవాళ్లకి ఈ పరికరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. వారే పూలకి ఒక పాకింగ్ పద్ధతిని కూడా రూపొందించారు.

సూర్యకి కీబోర్డ్ వాయించటం, డాన్ బ్రౌన్ పుస్తకాలు చదవటం అంటే ఇష్టం. ఇతనికి మైక్రో ఎకనామిక్స్ అంటే మక్కువ. పెద్దయ్యాక చార్టర్డ్ అకౌంటెంట్ అవ్వాలని అనుకుంటున్నాడు యితడు.

వెంకటేశ్వరన్‌కి టేబుల్ టెన్నిస్ ఆడటం, పుస్తకాలు చదవటం, కళలంటే ఇష్టం. ఇతనికి కోడింగ్ మరియు ఎలక్ట్రానిక్ అంటే చాలా మక్కువ. పెద్దయ్యాక ఇన్నోవేషన్‌ని చెయ్యాలని కోరిక.

వేణురామ్‌కి సంగీతం వినటం, కథల పుస్తకాలు చదవటం ఇష్టం. పెద్దయ్యాక మెకానికల్ ఇంజనీర్ అవుతాను అంటున్నాడితను. ●

## పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం

దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు.

మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.



[illegible]



[illegible]



[illegible]

హైదరాబాద్ వచ్చినప్పుడు
'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి.
ముందుగా మా కార్యాలయానికి ఫోన్ చేస్తే
మీ సందర్శనను అనుకూలంగా చేస్తాం.
'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :
77, రోడ్ నెం. 3, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27111959, సెల్ : 96528 01700.
ఇ-మెయిల్ : boddu.subhash4@gmail.com
గూగుల్ మ్యాప్‌లో 'పల్లెసృజన'
అని వ్రాస్తే మార్గం మీకు చూపిస్తుంది

# 'పల్లెసృజన' పాల్గొన్న వివిధ కార్యక్రమాలు




నవంబర్ 15న, హైదరాబాద్ లో రైతునేస్తం ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్నోవేషన్ల ప్రదర్శనలో పలుగురు ఇన్నోవేటర్లు పాల్గొని 20 ఇన్నోవేషన్లను ప్రదర్శనలో ఏర్పాటు చేయడమైనది. సందర్శకులు ఇన్నోవేషన్లను ఎంతో ఉత్సాహంతో తిలకించారు.



శ్రీ బంధోపాధ్యాయ, జనరల్ మేనేజర్, నాబార్డ్, తెలంగాణ ఆధ్వర్యంలో నాబార్డ్ టీం 'పల్లెసృజన'ను సందర్శించి రైతులను పల్లెసృజన ఇన్నోవేషన్లతో సంధానం చేయడానికి చర్చలు జరిపారు.



'పల్లెసృజన' ఇన్నోవేటర్ కర్నూలు జిల్లాకు చెందిన వెంకట కృష్ణ తయారు చేసిన మరో క్రిమి సంహారిణి 'నంది' పురుగు మందును కర్నూలు జిల్లా పాణ్యం శాసన సభ్యులు శ్రీ కాటసాని రాంభూపాల్ రెడ్డి గారి చేతుల మీదుగా ఆవిష్కరిస్తున్న చిత్రం.



ఇన్నోవేటర్ సి.హెచ్. నాగభూషణం రచించిన 'కరోనా వైరస్‌ను ఎదుర్కోవడం ఎలా' అన్న పుస్తకాన్ని 'పల్లెసృజన' అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం గారు ఆవిష్కరిస్తున్న చిత్రం.



డిసెంబర్ 2020లో హైదరాబాద్‌లో జరిగిన 'దివ్యాంగ్ విజ్ఞాన్ ప్రదర్శన'లో జయేష్ రంజన్, ఐఎఎస్ గారికి అల్లాడి ప్రభాకర్ రూపొందించిన 'సకల సౌకర్యాల మంచం' గురించి వివరిస్తున్న ఇన్నోవేటర్, పల్లెసృజన వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం.



డిసెంబర్ 24న సెంట్రల్ ట్రైబల్ యూనివర్శిటీ, ఆంధ్రప్రదేశ్ వైస్ ఛాన్సలర్ శ్రీ టి.వి. కట్టిమని గారు పల్లెసృజన కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా వారికి 'పల్లెసృజన' పత్రికలను అందజేస్తున్న వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం గారు.



# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సెల్ ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్ములమడక శశిమోహన్

## ఉల్లి నాటే యంత్రం

**సమస్య - పరిష్కారం :**

ఉల్లి సాగులో నారు పోసిన తర్వాత పొలంలో నాటడం అన్న పద్ధతితో రైతులకు వ్యవసాయ ఖర్చులు ప్రారంభమౌతాయి. ఈ ప్రక్రియ ధన,, సమయం, శ్రమలతో కూడుకున్న పని. ఇది తట్టుకోలేకే ఉల్లిసాగు మానివేసిన రైతులు కూడా చాలామందే ఉన్నారు. ఉల్లిసాగు చేసే రైతులకి అయ్యే ప్రధాన ఖర్చులలో ఒకటైన నారు నాటే ఖర్చు తగ్గించటానికి మహారాష్ట్రకు చెందిన 'పండరినాథ్ సర్జేరావ్ మోహే' అన్న రైతు దీనికి పరిష్కారంగా సెమీ ఆటోమేటిక్ యంత్రాన్ని కనిపెట్టారు.





**పరికరం :**

ఈ ఉల్లినారు నాటే యంత్రాన్ని ట్రాక్టరుకు అనుసంధానం చేసుకోవాల్సి వుంటుంది. ఇది కూలీల ఖర్చును, శ్రమను చాలావరకు తగ్గిస్తుంది. ఇది నారు నాటడంతో పాటు మరో మూడు పనులను కూడా చేస్తుంది. మొదటిది నారు నాటడం, రెండవది ఎరువులు వేయటం, మూడవది నీటి పారుదలకు అనువైన సాళ్ళను చేయటం. అంటే పొలంలో నారు నాటేముందు సాళ్ళు చేయాల్సిన అవసరం లేకుండా నేరుగా ఉల్లినారు నాటవచ్చు. మనిషి ప్రమేయం అన్నది సరియైన సమయంలో, యంత్రంలో నిర్ణీత ప్రదేశంలో నారును పెట్టడమే. నాటవలసిన దూరాన్ని, లోతును కూడా సవరించుకోవచ్చు. ఒకసారి సవరించిన తర్వాత ఖచ్చితమైన దూర,, లోతులో నారు నాటడం ఈ పరికరం ప్రత్యేకత. ఈ పనితో పాటు నీరు పారే సాళ్ళను కూడా దానంతట అదే చేసేస్తుంది.

**సాంకేతిక వివరాలు :**

* 25 హార్స్‌పవర్‌లు అంతకన్నా ఎక్కువ సామర్థ్యం కల ట్రాక్టరుకు ఈ పరికరాన్ని అనుసంధానం చేయాల్సి వుంటుంది.
* ఒకటిన్నర మీటర్ల వెడల్పులో 8 వరుసల్లో ఉల్లినారు నాటుకోవచ్చు. అంటే సాళ్ళ మధ్య 18 సెం.మీ., మొక్కల మధ్య 9 సెం.మీ. దూరంలో ఉల్లినారు నాటుకోవచ్చు.
* మొక్క నాటే లోతును భూమిని బట్టి 1 సెం.మీ. నుండి కావలసినంత లోతుగా నాటుకోవచ్చు.
* సాధారణంగా కూలీలతో హెక్టారుకు 4.2 లక్షల నుండి 4.7 లక్షల మొక్కలు నాటడం జరుగుతుంది. ఈ యంత్రంతో హెక్టారుకు 5.5 లక్షల మొక్కలు నాటుకోవచ్చు.
* ఈ యంత్రం పని చేయటానికి డ్రైవర్‌తో కలిపి 5 మంది మనుషులు అవసరమౌతారు.
* ఈ యంత్రంతో రోజుకు 8 గంటల సమయంలో ఒక హెక్టారులో ఉల్లినారు నాటుకోవచ్చు.
* ఎరువు వెయ్యటానికి ప్రత్యేకమైన మనిషి అవసరం లేదు. ఎరువును ఒక ట్యాంకులో నింపడం వల్ల అవసరమైనంత ఎరువును అదే వేసుకుంటూ వెళుతుంది.
* ఈ ఎరువు వేసే డ్రమ్ముతో సహా పరికరం మొత్తం 300 నుండి 350 కిలోల వరకు బరువు వుంటుంది.

**ముఖ్యాంశాలు :**

* వరుసల మధ్య, మొక్కల మధ్య ఖచ్చితమైన దూరంలో నాటు వేయడం జరుగుతుంది.
* నారు వృధా అయ్యే అవకాశాలు, చనిపోయే అవకాశాలు కూడా చాలా తక్కువ.
* ఖచ్చితమైన దూరంలో మొక్కలు ఉంటాయి కనుక యంత్ర సహాయంతో కూర్పిడి చేసుకోవడానికి సులభంగా ఉంటుంది.
* ఈ యంత్రం ద్వారా ఉల్లి మాత్రమే కాక, మిరప, టమోట లాంటి ఇతర నార్లను కూడా నాటుకోవచ్చు.

**పురస్కారాలు : .**

ఎస్.ఐ.ఎఫ్. వారు 2009లో తమ 5వ జాతీయ ద్వైవార్షిక పోటీలో నాటి రాష్ట్రపతి శ్రీమతి ప్రతిభాపాటిల్ గారు ఇతనిని సత్కరించడం జరిగింది.

## వరి నూర్పిడి యంత్రం

**సమస్య – పరిష్కారం :**

వరి సాగులో నూర్పిడి చేయడం అన్నది చాలా శ్రమ.



ఖర్చుతో కూడుకున్న పని. దీనికై సాంప్రదాయ పద్ధతిలో వరి కట్టలను మనుషులు ఒక బల్లపై కొట్టడం ద్వారా కంకుల నుండి ధాన్యం వేరవుతుంది. ఇంకా కంకులలో మిగిలిన ధాన్యాన్ని సేకరించడానికి వరిగడ్డిపైన పశువులను 'మెద' తిప్పటం ద్వారా సేకరిస్తారు. అయితే వరి కోసిన తర్వాత ఒక మోస్తరుగా ఆరిన తర్వాతనే ఈ ప్రక్రియంతా జరుగుతుంది. ఈ సమస్యకు పరిష్కారంగా సమయం వృథా కాకుండా, కూలీల ఖర్చును తగ్గించడానికి గడ్డిని ఆరబెట్టాల్సిన అవసరం లేకుండా పచ్చి గడ్డి నుండి కూడా నూర్పిడి చేయడానికి అస్సాంకు చెందిన 'ఫజల్ హక్' ఈ వరి నూర్పిడి యంత్రాన్ని తయారు చేశారు.

**పరికరం :**

ఈ వరి నూర్పిడి యంత్రం తక్కువ ఖర్చుతో మోటార్ సహాయంతో పనిచేస్తుంది. ఇది 5 హార్స్‌పవర్‌ల డీజిల్ మోటార్ సహాయంతో లేదా కరెంటు మోటారుతో పని చేస్తుంది. ధాన్యం వేరు చేసిన తర్వాత తూర్పు ఆరబెట్టడానికి అదనంగా ఇందులో బ్లోయర్ ఏర్పాటు చేయడమైనది. ఈ యంత్రం మొత్తం నాణ్యమైన స్టీలుతో తయారు చేయబడింది. ఈ యంత్రంలోకి వరిగడ్డి కట్టలను తొక్కించి పెడితే, ధాన్యం వేరు చేయబడి, బ్లోయర్ ద్వారా వేరు చేయబడిన గడ్డి మరోవైపు ముక్కలు కాకుండా బయటకు వస్తాయి.

**సాంకేతిక వివరాలు :**

* ఈ యంత్రం పొడవు 1,660, వెడల్పు 1,580, ఎత్తు 1,650 మి.మీ. కలిగి, 250 కిలోల బరువుంటుంది.
* గడ్డి నూర్పే సిలిండర్ నిమిషానికి 510 చుట్లు తిరుగుతుంది.
* బ్లోయర్ సహాయంతో గింజలను వేరు చేస్తుంది.
* గంటకు దాదాపు 450 కిలోల ధాన్యం నూర్పిడి చేయబడుతుంది.
* ధాన్యం వృథా 3.5 శాతానికి మించదు.

**ముఖ్యాంశాలు :**

* పంట పక్వానికి వచ్చిన తర్వాత ఆరబెట్టాల్సిన అవసరం లేకుండా పచ్చి గడ్డిని కూడా నూర్పిడికి ఉపయోగించవచ్చు.
* రైతుకు ఖర్చు, శ్రమ తక్కువ.
* గింజలు, పొట్టు (నూక), గడ్డి వేరుగా బయటకు వస్తాయి.
* ఈ యంత్రాన్ని ఏర్పాటు చేసుకోవడం, పని చేయించుకోవడం చాలా సులభం. నిర్వహణా ఖర్చులు కూడా చాలా తక్కువ.

**పురస్కారాలు :**

ఎన్.ఐ.ఎఫ్. వారు 2012లో తమ 6వ జాతీయ ద్వైవార్షిక పోటీలో ఇతనిని పురస్కరించడం జరిగింది.

**ఈ పరికరాలు కావలసిన వారు సంప్రదించండి :**

**సుభాష్, ఫోన్ : 96528 01700**





## పోచంపల్లి చేనేత కుటుంబాలకు మరింత ఊరటనిచ్చిన

# చింతకింది నరేందర్ ఇన్నోవేషన్‌లు

- జె. శశిమోహన్
- పల్లె వీరరాఘవ రెడ్డి

పోచంపల్లి చేనేత కుటుంబానికి చెందిన స్వర్గీయ లక్ష్మీనారాయణ, శ్రీమతి లక్ష్మిల రెండవ కుమారుడు చింతకింది నరేందర్. ఇతనికి భార్య ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు ఇంటర్మీడియట్, రెండవ వాడు 9వ తరగతి చదువుతున్నారు.

పోచంపల్లి చేనేత పనిలో చీర నేత మొదలు పెట్టేకన్నా ముందు చాలా శారీరక శ్రమ ముఖ్యంగా మహిళలు చేయాల్సి వుంటుంది. ఆ పనుల క్రమం ఎలా వుంటుందంటే..... మార్కెట్ నుండి నేతకు అవసరమైన దారాన్ని కొనుగోలు చేస్తారు. ఆ దారం చుట్టలుగా వుంటుంది ('లడి' అంటారు). ఆ దారాన్ని ముందుగా ఒక ప్లాస్టిక్ పైపుకు చుట్టుకుంటారు. ఆ తర్వాత ఆ పైపుకు చుట్టిన దారంతో 'ఆసు' పోస్తారు. ఆసు పోసిన తర్వాత చీరపై ఏ డిజైన్ రావాలో అందుకు తగిన డిజైన్‌ను ఆసు యంత్రం చుట్టిన దారంపైన నల్లటి మార్కర్ పెన్నుతో గుర్తిస్తారు. తర్వాత ఆ మార్కుల మధ్యలో చీరకు ఏ రంగులు అవసరమో చూసుకుని రెండు లేదా మూడు పర్యాయాలు వాటిపైన రబ్బర్‌తో ముడివేస్తారు. రబ్బర్‌తో ముడి వేసిన చోట రంగు అంటుకోకుండా, మిగతా ప్రాంతంలో రంగు అంటుకునేలా చేస్తారు. ఆ తర్వాత మరో రంగు అవసరమైనపుడు, మొదట చుట్టిన రబ్బర్‌లను తీసివేసి ముందుగా రంగు అద్దిన వాటిపైన రబ్బర్‌ను చుట్టి మరో రంగు అద్దుతారు. ఆ తర్వాత ఆ దారాన్ని మళ్ళీ ఆసు యంత్రంలో వున్నట్లుగానే సరిచేసి ఆ దారాన్ని మరోసారి ప్లాస్టిక్ పైపుకు చుట్టుకుంటారు. ఆ తర్వాత ఆ ప్లాస్టిక్ పైపు నుండి చిన్న కండెలుగా చుట్టుకుంటారు. ఈ చిన్న కండెగా చుట్టిన దారాన్ని నేత యంత్రంలో అటు ఇటూ తిరిగే 'దెకిలె'లోకి దోప్పుంది, చీర నేస్తారు.

ఈ క్రమంలో జరిగే పని మొత్తం ఒక్క డిజైన్ మార్కు వేయటం తప్ప దాదాపు ప్రతి పనీ మహిళలే చేస్తారు. అంటే మార్కెట్ నుండి తెచ్చిన దారాన్ని రీలుగా చుట్టడం, ఆసు పోయడం, ఆసు పోసిన దారం డిజైన్, రబ్బర్లు చుట్టడం, రంగులు అద్దటం అయిన తర్వాత మళ్ళీ రీల్‌గా చుట్టడం, ఆ రీలు నుండి చిన్న కండెలుగా చుట్టడం అన్నీ శారీరక శ్రమతోనే చేయాల్సి వుంటుంది. ఈ పనులన్నీ చేయాలంటే మహిళకు శారీరక శ్రమతో పాటు మానసిక శ్రమ కూడా అవసరం అంటే మైండ్ & బాడీ ఉపయోగించి పని చేయాల్సి వుంటుంది.

కాలం మారుతోంది, శారీరక శ్రమ పడే శక్తి మనుషుల్లో సన్నగిల్లుతోంది. ఈ పరిస్థితిని గమనించిన చింతకింది నరేందర్ ఆసు పోయటానికి ముందు, తర్వాత కూడా నేత కార్మికుల శ్రమను తగ్గించాలన్న ఉద్దేశ్యంతో మార్కెట్ నుండి తెచ్చిన దారాన్ని 'లడి'గా చుట్టడం, ఆసు పోసి,



లడీని పెద్ద కండెగా చుట్టే యంత్రం



దారాన్ని కండెలుగా చుట్టే శారీరక శ్రమ

రంగులు అద్దే పనులు అయిన తర్వాత దారాన్ని చుట్టడానికి, ఆ దారాన్ని చిన్న చెక్క ముక్కలకు చుట్టడానికి పనికి వచ్చేలా యంత్రాలను తయారు చేశారు.

ఇక ఇప్పుడు ఎంతో శ్రమ పడి దారాలను చుట్టలుగా చుట్టాల్సిన అవసరం లేదు. అతి తక్కువ కరెంటు ఖర్చయ్యే మోటారుతో ఈ పనులన్నీ చేసుకోవచ్చు. ఈ యంత్రాల తయారీ వలన చేనేత కార్మికులకు శ్రమ తగ్గటంతో పాటు, దాదాపు 80 శాతం శ్రమ, సమయం ఆదా అవటంతో వారి ఉత్పత్తి కూడా పెరిగింది. ఇప్పటికే 200 దాకా ఈ చిన్న చిన్న యంత్రాలను నేత కుటుంబాలకు అందించారు.

ప్రస్తుతం ఈ పనులన్నీ వారి వారి నేత యంత్రాల స్థోమతను బట్టి చిన్నవి, పెద్ద యంత్రాలను తయారు చేశారు. ఈ పనులన్నిటికీ వేరువేరు యంత్రాలు కూడా అవసరం లేదనుకుని అన్ని పనులకు ఉపయోగ పడేలా ఒకే యంత్రాన్ని రూపొందించారు. పని అయిపోయిన తర్వాత ఇళ్ళల్లో ఎక్కువ స్థలాన్ని ఆక్రమించుకోకుండా దాన్ని మడిచి, ఓ గోడ వారకు పెట్టేలా ఆ యంత్రానికి అమర్చిన భాగాలను ఎక్కడివక్కడ విడదీసి చిన్నదిగా తయారయ్యేలా చేశారు. ఈ యంత్రం నేత కార్మికులను బాగా ఆకట్టుకుంటోంది.

నూలును అచు పోసిన తర్వాత చీర డిజైన్‌ను మార్క్ చేసేందుకు కూడా ఒక యంత్రాన్ని తయారు చేస్తున్నారు. అది దాదాపు పూర్తయింది. ప్రస్తుతం ట్రయల్ రన్ నడుస్తోంది. ఇది కూడా అతి త్వరలోనే నేత కార్మికులకు అందుబాటులోకి



లడీ నుండి శారీరక శ్రమతో ప్లాస్టిక్ పైపుకు చుట్టడం.



ఇదే పనికి తయారు చేసిన యంత్రం



రంగులద్దే దారాన్ని పైపుకు చుట్టడం



దారం చుట్టే మూడు పనులకు ఒకే యంత్రం

వస్తుంది. చీర డిజైన్‌ను ఒక చిప్ రూపంలో యంత్రానికి అందిస్తే దానంతట అదే డిజైన్‌కు అవసరమైన మార్కింగ్ చేసి ఇస్తుంది. ఇది తయారైన తర్వాత పోచంపల్లి చేనేతలో ఎన్నో రకాల కొత్త డిజైన్లు వచ్చేలా విప్లవాత్మక మార్పు తెచ్చే అవకాశం వుందని నేత కార్మికులు ఆశాభావంతో ఎదురు చూస్తున్నారు. ఈ యంత్రం మార్కెట్ లోకి విడుదల అయితే మరిన్ని కొత్త రకాల డిజైన్ చీరలు మహిళలకు అందుబాటులోకి రావటంతో పాటు పోచంపల్లి చేనేత కార్మికుల ఉత్పాదకతతో పాటు ఆదాయం కూడా తప్పక పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

తన స్వంత స్థలంలోనే ఒక షెడ్డు ఏర్పాటు చేసుకుని అవసరమైన కొంత వెల్డింగ్ పనిని బయట చేయించుకుని యంత్రాలను తానే స్వయంగా బిగించుకుని అమ్ముకుంటూ జీవనం సాగించటంతో పాటు తోటి నేత కార్మికుల కష్టాలను కూడా తీరుస్తున్న నరేందర్‌ను అభినందిస్తోంది 'పల్లెసృజన'. ఇతను తయారు చేసిన అన్ని యంత్రాలకు పేటెంట్ హక్కులను ఇప్పించే ప్రయత్నం చేస్తోంది. ఈ వినూత్న ఇన్నోవేషన్లకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చేందుకు తగినంత ఆర్థిక సహాయం అందించటానికి 'పల్లెసృజన' కృషి చేస్తున్నది. ●

**ఇన్నోవేటర్ చింతకింది నరేందర్ ఫోన్ : 9542557303**



చేతితో డిజైన్ మార్క్ చేయడం.



యంత్రంతో డిజైన్ మార్కింగ్



## ఇన్నోవేటర్ నన్నం తిరుపతి అద్భుత శిక్షణ

# కరెంటు స్తంభాలను సులభంగా ఎక్కుతున్న 'మహిళా మణులు'

- పల్లె వీరరాఘవ రెడ్డి

నన్నం తిరుపతి తనకు వచ్చిన కష్టాలలోంచి ఇన్నోవేషన్ చేసిన కరెంటు స్తంభాలను ఎక్కేందుకు చెప్పులు 'పల్లెసృజన' పాఠకులకు గుర్తుండే వుంటుంది. 'పల్లెసృజన' ద్వారా వెలుగులోకి వచ్చి, అంతర్జాతీయ ఖ్యాతిని గడించిన ఇన్నోవేటర్ ఇతను. తాను ఇన్నోవేషన్ చేసి, వాటిని తయారు చేసి, వ్యాపారం చేసుకోవడమే కాదు, ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు పరిసర రాష్ట్రాల నుంచి కూడా యువతను ఆకర్షించి కరెంటు స్తంభాలను ఎక్కేందుకు శిక్షణ ఇస్తున్న విషయం కూడా పాఠకులకు గత సంచికలలో వివరించాం. ఇప్పుడు మరో నూతన అధ్యాయానికి నాంది పలికాడు నన్నం తిరుపతి.

కరెంటు స్తంభాలను ఎక్కే 'ఎలక్ట్రిక్ లైన్‌మన్' ఉద్యోగం ఇప్పటిదాకా కేవలం పురుషులు మాత్రమే చేయగలిగినది అన్న విషయం అందరికీ తెలిసిందే. మారుతున్న సమాజంలో ప్రతి రంగంలో మహిళలు తామేమీ తీసిపోము అన్నట్లుగా ప్రతి శాఖ ఉద్యోగాలలో తమ ప్రతిభను చాటుతున్నారు. ఈ మహిళా ప్రభంజనం ఆర్టీసీ కండక్టర్‌లతో మొదలై ప్రస్తుతం డ్రైవర్లుగా కూడా ఉద్యోగం చేస్తున్నారు. ఇప్పుడు కరెంటు స్తంభాలను ఎక్కి మరమ్మతులు చేసే 'లైన్ ఉమెన్' ఉద్యోగావకాశాలు కల్పించాలని పోరాటం సలపడంతో కోర్టు కూడా వీరికి అవకాశం కల్పించాలని చెపుతూ అయితే మహిళలు కరెంటు స్తంభాలను పురుషులతో సమానంగా ఎక్కి పని చెయ్యగలం అని నిరూపించుకోవాలని చెప్పారు. దీన్ని అవకాశంగా తీసుకున్న మన ఇన్నోవేటర్ నన్నం తిరుపతి "మహిళలకు కరెంటు స్తంభాలను ఎక్కేందుకు శిక్షణ" ప్రారంభించాడు. ఇతని శిక్షణా తరగతుల విషయాన్ని తెలుసుకుని ఇప్పటికి 50 మందికి పైగా తిరుపతి వద్ద శిక్షణ పొంది ఉద్యోగాన్వేషణలో సఫలమవుతున్నారు.

సాధారణంగా కొన్ని పనులు 'మగ' వారు మాత్రమే చెయ్యాలి, కొన్ని పనులు 'ఆడ' వారు మాత్రమే చెయ్యాలి అన్న లింగభేదం ఇకనుండి తొలగిపోయేలా నూతన అధ్యాయం ఆరంభం అయిందని చెప్పవచ్చు. నన్నం తిరుపతి శిక్షణార్థం వచ్చే మహిళల శారీరక సామర్థ్యాన్ని, వారి ధైర్య, సాహసాలను వారితో మాట్లాడి, చూసి ఒక అంచనాకు వచ్చిన తర్వాత వారికి ఎలాంటి శిక్షణ ఇవ్వాలి, వారి శారీర దారుఢ్యం పెరగడానికి ఏ విధమైన శారీరక వ్యాయామం నేర్పాలి అని నిర్ధారించుకుని ముందుగా కరెంటు స్తంభాలను ధైర్యంగా ఎక్కేలా వారిని మానసికంగా సిద్ధం చేస్తారు. ఆ తర్వాత వారి మనస్తత్వం శరీర బలాన్ని బట్టి షటిల్, ఫుట్‌బాల్, వాలీబాల్, రోప్ జంపింగ్, తాడు లాగడం, యోగా, శారీరక వ్యాయామాలు నేర్పిస్తారు. ఆ తర్వాత కరెంటు స్తంభాలను ఎలా ఎక్కితే పైదాకా చేరుకుంటారో కొన్ని మెళకువలను నేర్పుతాడు.

ప్రకాశం జిల్లా చీరాలలోని 'పట్టి సంఘం' అనే గ్రామంలోని తన స్వంత స్థలంలో ఈ శిక్షణ నిర్వహిస్తున్నాడు నన్నం తిరుపతి. ఈ శిక్షణ కొందరు ఒక నెలరోజుల్లో నేర్చుకుంటే మరి కొందరు 2 నెలల శిక్షణ కూడా



తీసుకుంటారు. శిక్షణార్థులకు తగిన భోజన, వసతి సౌకర్యాలు చాలా చక్కగా ఏర్పాటు చేశారు. అందుకు అవసరమైన పూర్తి రక్షణను కూడా తిరుపతి ఏర్పాటు చేయడం జరిగింది. మహిళలు విమానం లాంటి వారు. నిదానంగా పైకి లేస్తారు. ఆకాశంలో విహరించి మళ్ళీ అంతే నిదానంగా క్రిందకు దిగుతారు. పని పూర్తయిన తర్వాత కూడా వారిలో అలసట కనిపించదు. కానీ మగపిల్లలు రాకెట్‌లా పైకి దూసుకు పోతారు వేగంగా క్రింద పడినట్లు వుంటారు. వీరిలో అలసట స్పష్టంగా కనిపిస్తుంది అంటారు తిరుపతి.

శిక్షణ అందించే ఇన్నోవేటర్ తిరుపతి ఇప్పటి వరకు గమనించిన విషయం ఏమిటంటే కరెంటు స్తంభాలను ఎక్కి అక్కడ పని చేయటంలో మగవారికన్నా ఆడవారే చాలా ఓర్పుతో, ఎక్కువ సమయాన్ని కేటాయించి పని చెయ్యగలరు అని తెలుసుకున్నారు. ఆయా మహిళల నైపుణ్యాన్ని బట్టి కొందరు 10 రోజుల్లో నేర్చుకుంటే మరి కొందరు 15, 20, 30 రోజుల్లో కరెంటు స్తంభాలను ఎక్కేందుకు పరిపూర్ణంగా సుశిక్షితులై బాహ్య ప్రపంచంలోకి అడుగు పెడతారు. ఇలా పరిపూర్ణత సాధించిన, సాధిస్తున్న కొందరు మహిళల మనోభావాలను తెలుసుకుందాం.....

**ఉష, నల్గొండ జిల్లా, వయస్సు 25 సం.లు:**

బి.ఎ., విద్య పూర్తి చేసుకున్న ఉష వారి జిల్లాలో 'లైన్‌మెన్' ఉద్యోగానికి దరఖాస్తు చేసుకుంది. దరఖాస్తు చేసుకునే టప్పుడే అధికారులు ఈ ఉద్యోగానికి శారీరక పరీక్ష (కరెంటు స్తంభాలను ఎక్కడం) కూడా ఉంటుంది అని తగిన




శిక్షణ తీసుకోవాల్సి సలహా ఇవ్వటంతో ఇక్కడికి వచ్చింది. ఇక్కడ శిక్షణను తిరుపతి గారు చాలా బాగా ఇస్తున్నారని, మొదట ఒక ఐదారు రోజులు కొద్దిగా ఒళ్ళు నొప్పులుగా అనిపించాయి ఆ తర్వాత అలవాటై పోయింది. ఇప్పుడు సులభంగా కరెంటు స్తంభాన్ని ఎక్కి గలుగుతున్నాను అంది. శారీరక వ్యాయామాలైన టైర్లు ఒకచోట నుండి ఒకచోటకు మార్చడం, డంబెల్స్‌తో వ్యాయామం, ఆటలు ఆడిస్తుంటారు. అవి కూడా మాకు శారీరక దారుఢ్యాన్ని మెరుగు పర్చటంతో పాటు, మానసిక ఉల్లాసాన్ని కూడా కలిగిస్తున్నాయి. ఈ శిక్షణ తీసుకోవడంతో లైన్ ఉమెన్ ఉద్యోగాన్ని తప్పక సాధిస్తాననే నమ్మకం కలిగిందని, శిక్షణకు వచ్చేటప్పుడు చాలామంది మహిళవు నువ్వు కరెంటు స్తంభాలను ఎక్కే శిక్షణ తీసుకోవటం ఏమిటి అని నిరుత్సాహ పరిచారు. ఇప్పుడు వారి మాటలకు చేతలతో సమాధానం చెప్పగలనన్న ధైర్యం వచ్చింది. మానసికంగా కూడా ధైర్యంగా వుండేందుకు తిరుపతి గారు చాలా బాగా చెబుతున్నారని కితాబునిచ్చింది. ఇక్కడ భోజన, వసతి సౌకర్యాలు కూడా చాలా బాగా ఉన్నాయని, ఇంట్లో వున్నట్లుగానే అనుభూతి పొందుతున్నాము, సౌకర్యవంతంగా వుందని అన్నది.


**గ్రీష్మ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, వయస్సు 25 సం.లు:**



ఇంటర్ పూర్తి చేసి, డిగ్రీ విద్యను మధ్యలోనే మానివేసింది గ్రీష్మ. తాను ట్రైనింగ్‌కు వచ్చానన్న విషయం కూడా తెలియటం లేదని, ఇంట్లో వున్నట్లుగానే అన్ని సౌకర్యాలు వున్నాయని, తిరుపతి గారు ఇచ్చే ఫిజికల్, మోరల్ శిక్షణలు అన్నీ చాలా బాగా అర్థమవుతున్నాయని అంది. మొదట ఒక 5 రోజులు మాత్రం కొద్దిగా ఇబ్బందిగా వుండేది. ఇంటివద్ద ఇటువంటి వ్యాయామాలు ఏమీ చెయ్యం కాబట్టి అవి అలవాటైన తర్వాత ఇప్పుడు చాలా సులభంగా అనిపిస్తోంది. కరెంటు స్తంభాలను ఎక్కడం, దిగడం అన్నీ సారు దగ్గరుండి ధైర్యం నూరి పోస్తూ మెళకువలు నేర్పడంతో మాకు ఎలాంటి ఇబ్బంది కలగటం







లేదు. నాను శిక్షణకు వచ్చి ఇప్పటికి 15 రోజులు మాత్రమే అయింది. అయినా ఇప్పటికే నాకు కరెంటు స్తంభాలను ఎక్కడం, దిగడం వచ్చేసింది. టీచర్ లక్ష్మీ తిరుపతి గారు ఎంత బాగా అర్థమయ్యేలా శిక్షణ ఇస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. స్తంభాన్ని పై వరకు ఎక్కి, అక్కడ కూర్చుని చేసే పనులను, క్రిందకు దిగేటప్పుడు లేదా ఎక్కేటప్పుడు జారిపోతే ఎలా పట్టుకోవాలి లాంటి వాటిని కూడా ఎంతో సులభంగా గ్రహించ గలిగేలా నేర్పిస్తున్నారు.

**పవిత్ర, మధుపల్లి (పర్వతగిరి వరంగల్), తెలంగాణ:**




పవిత్రకి పెళ్ళి 9 నెలల బాబు ఉన్నాడు. ఆమె భర్త మొదట తిరుపతికి ఫోన్ చేసి, మీవద్ద శిక్షణకు నా భార్యను పంపాలి అనుకుంటున్నాను, ఆమె 9 నెలల క్రితమే ప్రసవమైంది, అది కూడా సిజేరియన్ డెలివరీ మరి శిక్షణ చేయగలదా అని అడిగాడు. దానికి తిరుపతి ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా తన పనులు చేసుకుంటూ వుందా అని తెలుసుకుని, సరే పంపండి అన్నారు. ఇప్పటి వరకు శిక్షణ తీసుకున్న వారిలో అత్యంత ప్రతిభ కనబరిచిందని కితాబునిచ్చారు తిరుపతి. తాను మగవారితో సమానంగా కరెంటు స్తంభాలను ఎక్కగలను అని, ఉద్యోగాన్వేషణలో కరెంటు స్తంభాలను ఎక్కే పోటీలో మగవారితో పోటీని ధైర్యంగా ఎదుర్కోగలనని చెప్పింది. ఈమె నైపుణ్యం, ధైర్యం పట్టాయనటానికి నిదర్శనం ఏమిటంటే ఆమె తన 9 నెలల బాబును వీపుకు కట్టుకుని కరెంటు స్తంభాన్ని ఎక్కి, ఝాన్సీ రాణి అనిపించుకుంది.

**రత్నకుమారి, నల్గొండ జిల్లా, వయస్సు 29 సం.లు:**



రత్నకుమారి శిక్షణకు వచ్చే ముందు విపరీతమైన కాలి నొప్పితో బాధపడేది. ఇంత నొప్పి పెట్టుకుని నువ్వు కరెంటు స్తంభాలను ఎక్కేందుకు శిక్షణకు వెళ్ళడమేమిటని ఇంట్లో అందరూ నిరుత్సాహ పరిచారు. అయినా మనో ధైర్యంతో శిక్షణకు వచ్చింది. ఇక్కడ తిరుపతి ఇచ్చే శాస్త్రీయబద్ధమైన శిక్షణ వల్ల నా కాలు నొప్పి కూడా ఎలా తగ్గిపోయిందో అర్థం కావడం లేదు. నాకు ఇప్పుడు చాలా ధైర్యంగా ఉంది. నేను తప్పకుండా ఉద్యోగం సంపాదించ గలను అనే నమ్మకం ఇప్పటికే వచ్చేసింది.

**హారతి, వరంగల్, వయస్సు 29 సం.లు:**



నేను ఎం.ఏ., బి.ఇడి., చదివాను. ఎలక్ట్రీషియన్ పోస్టులు పడితే నేను దరఖాస్తు చేశాను. ఈ ఉద్యోగానికి కరెంటు స్తంభాలను ఎక్కడం తెలిసి వుండాలన్న నిబంధన వుండటంతో వేరే ఒకచోట శిక్షణకు వెళ్ళాను. అక్కడ శిక్షణ జరిగేటప్పుడు కరెంటు స్తంభం పైనుండి క్రింద పడ్డాను. ఇక ఈ శిక్షణ మనవల్ల కాదు, ఈ ఉద్యోగం వదులుకోవాల్సిందే అని నిరుత్సాహపడుతున్న సమయంలో 'యూ ట్యూబ్'లో నల్లం తిరుపతి శిక్షణ గురించిన వీడియో చూశాను. అప్పుడు వారికి ఫోన్ చెయ్యగా, అమ్మా ఇక్కడ అంత మగ పిల్లలు శిక్షణలో వున్నారు. నీవు ఒక్కదానివే వస్తే సమస్యలు



ఎదురౌతాయేమో, నీలాంటి వారు మీదగ్గ ఎవరైనా వుంటే వారిని జత చేసుకుని వస్తే బాగుంటుంది అన్నారు. నా కుడి చేతికి వున్న ఒక నరానికి దెబ్బ తాకి సర్జరీ అయింది. అది కూడా భుజం నుండి మోచేతికి మధ్యలో మూడుసార్లు సర్జరీ అయింది. ఈ విషయాన్ని తిరుపతితో చెప్పగా కరెంటు స్తంభాన్ని ఎక్కాలన్న పట్టుదల నీలో వుంది కాబట్టి నీవు ఎక్క గలవు వచ్చేసెయ్ అని ధైర్యం ఇచ్చారు. ముగ్గురు మిత్రులను జత చేసుకుని అందరమూ శిక్షణకు వెళ్ళాము. ఆ సమయంలో ఇంట్లో వాళ్ళు కూడా నీ చేతికి ఇలా వుంది కదా నీకు ఉద్యోగం అవసరమా మళ్ళీ ఏదైనా అయితే మొత్తం చెయ్యి తీసివేయాల్సి వస్తుంది, మాకు నీ ఉద్యోగం కన్నా బ్రతికి వుండటమే కదా మాకు కావాల్సింది అని కొద్దిగా భయపడ్డారు. మా నాన్నగారు కూడా లైన్‌మెన్‌గా ఉద్యోగం చేస్తూ మరణించారు. మేము నలుగురం ఆడపిల్లలము. మా నాన్నగారు చనిపోవటంతో నాకు 10వ తరగతి అయిపోగానే పెళ్ళి చేశారు. ఇప్పుడు నాకు ఇద్దరు సంతానం. పెళ్ళి అయిన తర్వాత కూడా చదువుమీద శ్రద్ధతో ఐటిఐ, డిగ్రీ, బి.యిడి కూడా చదివాను. మా వారు కూడా నీ చేతికి ఇలా పెట్టుకుని ఈ కఠిన శిక్షణ చేసి ఉద్యోగం కోసం పోరాడటం అవసరమా అన్నారు. కానీ నాకు మాత్రం ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం పొందాలి, వస్తే ఉద్యోగం పోతే చెయ్యి అనుకుని ప్రకాశం జిల్లాకు శిక్షణ కొరకు వెళ్ళాను.

నేను ఎంత అవ నమ్మకంతో వున్నా తిరుపతి గారు ఇచ్చిన ప్రోత్సాహకరమైన శిక్షణ నన్ను ముందుకు నడిపించింది. నేను శిక్షణలో వుండగానే 'అప్రెంటిస్'గా ఉద్యోగం వచ్చింది. ఇప్పుడు ఇక్కడ 25 మంది పురుషులతో సమానంగా మహిళనైన నేను కరెంటు స్తంభాలను ఎక్కి పని చేయగలుగుతున్నాను అంటే దానికి కారణం ఖచ్చితంగా తిరుపతి గారు నాలో నింపిన ధైర్యం, వారు ఇచ్చిన ప్రోత్సాహమే. శిక్షణ పూర్తి చేసుకుని వచ్చిన తర్వాత నాకు ఇంట్లో, ఆఫీసులో, సమాజం నన్ను గౌరవించటం మొదలు పెట్టారు. దీనికి కారణం శారీరక, దృఢత, ఆత్మ విశ్వాసాలే. దీనికంతటికి కారణం నస్యం తిరుపతి గారే.

**అనిత, తొర్రూర్, వయస్సు 28 సం.లు:**



నేను పరీక్ష వ్రాయటానికి వెళ్ళేటప్పుడు బైక్ ఆక్సిడెంట్‌లో నా రెండు మోకాళ్ళకు బాగా దెబ్బ తగిలింది. నా రెండు మోకాళ్ళకు సర్జరీ జరిగింది. అటువంటి విపత్కర పరిస్థితుల్లో కూడా సాధించాలన్న పట్టుదలతో ఇంట్లో వాళ్ళ ప్రోత్సాహంతో తిరుపతి గారి వద్దకు కరెంటు స్తంభాలను ఎక్కేందుకు శిక్షణకు వెళ్ళాను. 15–20 రోజుల వరకు మోకాళ్ళ నొప్పితో చాలా బాధపడ్డాను. వార్మప్ వ్యాయామాలు, అయినా కూడా అడుగేయలేక పోయాను కొన్ని రోజులు. నామీద నాకు నమ్మకం లేకపోయినా, ఇంట్లో వాళ్ళ నమ్మకాన్ని వమ్ము చేయకూడదు అని అలాగే పోరాడాను. నా బరువు కూడా 80 కిలోలు కావడంతో ఎంతో కష్టపడాల్సి వచ్చేది. నాకు స్తంభం పైకి ఎక్కితే 'హైట్ ఫోబియా' కారణంగా కళ్ళు తిరిగేవి. కొన్నిసార్లు రాత్రి పూట కరెంటు స్తంభాన్ని ఎక్కించి ఆ హైట్ ఫోబియా మనసులోనుండి పోయేలా చేశారు. ఇప్పుడు ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో నేను మెరిట్‌లో 2వ పొజిషన్‌లో వున్నాను. కరెంటు స్తంభాన్ని ఎక్కేలా శిక్షణ ఇచ్చిన తిరుపతి రావుగారికి నా కృతజ్ఞతలు.

ఎంతో మంది మహిళల్లో నూతనోత్తేజాన్ని, కొత్త కొత్త ఉద్యోగాలలో ప్రవేశం పొందాలన్న వారి కోరిక తీర్చే దిశగా కరెంటు స్తంభాలను ఎక్కడంలో పురుషులతో సమానంగా మహిళలను తయారు చేస్తున్న, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఈ యువ ఇన్నోవేటర్ ఏ సంఘ సంస్కర్తకన్నా తక్కువేమీ కాదని 'పల్లెసృజన' భావిస్తోంది. ఇతరుల బాధలను అర్థం చేసుకోవడం నేర్చుకున్న తిరుపతి సమాజంలోని అసమానతల వల్ల కలిగే బాధలను ముఖ్యంగా మహిళల మనోస్థితిని అర్థం చేసుకొని వారికి స్తంభాలు ఎక్కడానికి శిక్షణ ఇవ్వడమన్న వినూత్న విప్లవ ఆలోచనను ఆచరణలో పెట్టిన ఘనత ఈ యువ సమాజ సంస్కర్త నస్యం తిరుపతి ఎంతో అభినందనీయుడు. ●

నస్యం తిరుపతి, ఫోన్ : 9949245519

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.

National Innovation Foundation-India



ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

## జాతీయ 12 వ ద్వైవార్షిక పోటీలు

**పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు**

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 12వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృత్తుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సామూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మన్నికగల, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సహాయం తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

ఉత్తమమైన వాటిగా గుర్తించ బడిన వాటిలో జాతీయ మొదటి బహుమతిగా **రూ. 5,00,000**, జాతీయ రెండవ బహుమతిగా **రూ. 3,00,000**, జాతీయ మూడవ బహుమతిగా **రూ. 1,00,000**లను వివిధ వర్గాలలో ఇవ్వబడును. జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. 7,50,000లు గొప్ప ఇన్నోవేటర్‌కు లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా ఏర్పరచుకొన్న వారికి ఇవ్వబడును. అంతే కాదు ప్రోత్సాహక బహుమతి క్రింద రూ. 10,000లను వివిధ వర్గాలలో ఎన్నుకోబడిన ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు, పర్యావరణానికి తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని తరతరాలకి తీసుకువెళ్ళడానికి తోడ్పడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను తరతరాలకి కృషి చేసిన ఎంట్రప్రెన్యూర్/ ప్రింట్ మీడియా ఇత్యాదులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2021** లోగా మాకు చేరేలా పంపండి.

gian

మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :

National Innovation Foundation,
C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.
Phone: (02764) 261131/32/ 38/ 39, Fax: (079) 26731903, Email: campaign@nifindia.org, Website: www.nif.org.in

గమనిక : [illegible] http://www.nif.org.in/announcement [illegible] 040-27713958 [illegible]



# ఆయుర్వేద జ్ఞాన మథనం

# కునుకు పట్టనివ్వని 'ఆస్తమా'

ప్రస్తుతం వాతావరణంలో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. చలి ఎక్కువ మోతాదులో వుండటం వల్ల జలుబు, దగ్గు తో పాటు చాలామందిలో 'ఆస్తమా' కూడా ఈ సమయంలో చాలా ఇబ్బందులకు గురి చేస్తుంది. ఆస్తమాకు కారణాలు జలుబు ముదిరి ఇన్‌ఫెక్షన్‌కు గురి కావటం వల్ల కూడా చాలా మందిలో జరుగుతూ వుంటుంది. ఇంట్లోని దుమ్ము ధూళితో పాటు అతి సూక్ష్మ జీవులు కూడా చేరొతాయి. ఈ సూక్ష్మ జీవులు ఎక్కువగా మెత్తటి వాటిపైన ఎక్కువగా వుంటాయి. అంటే పిల్లులు, కుక్కలు, పూలలోని పుప్పొడి రేణువులపైన కూడా ఇవి నివసిస్తూ వుంటాయి. ఇంకా ఇతర ఎన్నో కారణాల వల్ల ఈ సూక్ష్మ జీవులు ఎక్కువగా మనలను ఇబ్బందికి గురి చేస్తూ వుంటాయి. ఆస్తమా నుండి ఉపశమనం పొందడానికి కొన్ని చిట్కాలను ఇక్కడ పొందుపరుస్తున్నాం.

**'ఆస్తమా' వ్యాధి నుండి ఉపశమనానికి చిట్కాలు:**

ప్రస్తుతం కరోనా ప్రభావం ఇంకా వుంది కాబట్టి మాస్కులను ఉపయోగించటంతో పాటు కొన్ని రకాల చిట్కాలను పాటిస్తే అస్సలు పెద్దగా ఇబ్బంది పెట్టకుండా ఉపశమనం పొందవచ్చు. భయపడాల్సిన అవసరం లేదు. ఆధునిక సమాజాన్ని పట్టి పీడిస్తున్న జబ్బుల్లో 'ఆస్తమా' ఒకటి. ప్రతి వంద మందిలో ఐదారుగురిని పట్టి పీడిస్తున్న జబ్బు ఇది. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 20 కోట్ల మంది ఈ ఆస్తమా వల్ల ఇబ్బంది పడుతున్నారని ఒక నివేదిక చెబుతోంది. ఆస్తమా వున్న వాళ్ళకు మొత్తం ఊపిరి తిత్తులు మూసుకు పోయి, గాలి తక్కువగా పీల్చటం వల్ల కొందరు నోటితో గాలిని పీల్చుతూ వుంటారు.



మనం ఇంట్లో వాడే దిండ్లు, పరుపులు, దుప్పట్లను అప్పుడప్పుడు ఎండలో బాగా ఎండబెట్టి గలిగితే ఆస్తమా నుండి కొంత వరకు బైట పడవచ్చు. బొప్పాయి లాంటి పండ్లను బాగా తీసుకుంటూ వుండాలి. దాల్చిన చెక్క 10 గ్రా., యాలకులు 20 గ్రా., ఒక జాజికాయ, అతి మధురం 100 గ్రా., అడ్డసరం ఆకుపొడి 100 గ్రా. తీసుకుని, వీటన్నిటికి కలిపి బాగా మెత్తగా మిక్సీలో పొడిగా చేసి పెట్టుకుని ఒక సీసాలో భద్రపరచుకుని, ఉదయం, సాయంత్రం ఒక స్పూను పొడిని నీటిలో కలుపుకుని త్రాగినట్లయితే ఈ బాధలన్నిటినుండి విముక్తి పొందవచ్చు. చిన్న పిల్లలయితే అర చెంచా, మరీ చిన్న పసికందులైతే పావు భాగం స్పూను పొడిని నీటిలో కలిపి తాపించాలి. ఈ పొడిని చంటి పిల్లల వద్దనుండి వృద్ధుల వరకు ఎవరు తీసుకున్నా ఎటువంటి ప్రమాదము లేదు.

ఆస్తమా వున్నవాళ్ళు ఉదయం లేవగానే చిటికెడు పసుపు జండుబామ్ లేదా విక్సులను వేడి నీటిలో వేసుకుని ఆవిరి పట్టుకో గలిగితే ఎటువంటి మందులు తీసుకోకున్నా తగ్గించుకోవచ్చు. ఇలా 40 రోజులు క్రమంగా తీసుకున్నట్లు అయితే ఈ ఇబ్బందుల నుండి బైట పడవచ్చు.

**'సయాటికా' నొప్పి నుండి నివారణకు చిట్కాలు:**

ఆస్తమా తర్వాత బాగా ఇబ్బంది పెట్టేది జబ్బు 'సయాటికా'. సయాటికా అన్నది నడుం వద్ద మొదలై కాలి పాదం వరకు వున్న పొడవైన శరీరంలోని అన్నింటిలోకన్నా పెద్ద, పొడవైన నరం. ఈ నరం వెన్నెముక లో నడుముకు పై భాగంలో లోపం కండరాల వల్ల ఒత్తిడికి గురి కావడి నడుం వద్ద నుండి పాదం వరకు విపరీతమైన నొప్పికి గురి చేస్తూ వుంటుంది. ఇది అనుభవించే వారికే తప్ప ఇతరులకు వివరించడం కూడా సాధ్యం కానంత నొప్పికి గురి చేస్తూ వుంటుంది.

ఈ బాధ నుండి విముక్తి పొందడానికి 'పారిజాతం' ఆకులు 15 తీసుకుని చిన్న చిన్న ముక్కలుగా చేసుకుని, నీళ్ళల్లో బాగా మరిగించి, చల్లారిన తర్వాత రోజుకు ఒకసారి చొప్పున 40 రోజుల పాటు సేవించినట్లయితే ఈ సయాటికా బాధ




నుండి బయట పడవచ్చు.

పారిజాతం ఆకులు లభించని వాళ్ళు శొంఠి కషాయం అంటే శొంఠి పొడి ఒక అర చెంచా ఒక గ్లాసు నీళ్ళలో వేసి ఆ నీరు అర గ్లాసు అయ్యేదాకా బాగా మరిగించి, అందులో అర స్పూను ఆముదం వేసుకుని 40 రోజుల పాటు తీసుకున్నట్లయితే సయాటికా నొప్పి తగ్గుతుంది. 15 రోజుల తర్వాత మంచి గుణం కనిపిస్తుంది.

ఈ కషాయాలు తాగే వాళ్ళు ఎక్కువగా మజ్జిగ తీసుకుంటూ వుండాలి. ఎందుకంటే ఈ కషాయాలు శరీరంలో ఎక్కువగా వేడిని కలుగజేస్తాయి. కాబట్టి శరీరాన్ని చల్లబరచటానికి మజ్జిగ ఎక్కువగా తీసుకోవటం తప్పనిసరి.

ఈ కషాయాలు తయారు చేసుకోవటం మావల్ల కాదు అనుకునే వారు సమీపంలోని ఆయుర్వేద షాపుల్లో 'మహా యోగరాజ గుగ్గులు' అనే మాత్రలు లభిస్తాయి. వీటిని రోజూ మూడు పూటలా అంటే ఉదయం, మధ్యాహ్నం, రాత్రి భోజన అనంతరం తీసుకున్నట్లయితే కూడా సయాటికా నుండి ఉపశమనం పొందవచ్చు. వీటివల్ల కూడా శరీరానికి ఎటువంటి సైడ్ ఎఫెక్ట్‌లు ఉండవు.

**సెల్‌ఫోన్ వల్ల లభించే జబ్బుల నుండి ఉపశమనం :**

సెల్‌ఫోన్ వల్ల ప్రపంచం మన గుప్పిట్లోకి వస్తుంది అంటారు తయారీదారులు కానీ ప్రపంచంతో పాటు ప్రపంచం లోని ఎన్నో జబ్బులను కూడా మన శరీరంలోకి తెచ్చుకుంటున్నాం అన్నది పరమ రహస్యం. ఈ విషయాన్ని అనేక పరిశోధనలు, సర్వేలు తేల్చి చెప్పాయి. రెండు సెల్‌ఫోన్‌ల మధ్యన ఒక కోడిగుడ్డును ఉంచినట్లయితే కేవలం 40 నిమిషాలలో కోడిగుడ్డు ఉడుకుతుందని ఒక కథనం. అందుకే



కొన్ని దేశాలలో సెల్‌ఫోన్ టవర్లను జనావాసాల మధ్య పెట్టడాన్ని నిషేధించారు. ఎక్కడైనా సెల్‌ఫోన్ టవర్ పెట్టినట్లయితే ఆ సమీపంలోని పిల్లల మెదడు దెబ్బ తింటుందని ఒక సర్వే నిర్ధారించింది.

ఈ సెల్‌ఫోన్ జబ్బుల నుండి ఉపశమనం పొందడానికి వాడే ప్రతి ఒక్కరు ఉదయం లేవగానే చెవులను ఒకసారి బాగా శుభ్రపరచుకోవాలి. ఒక వంద గ్రాముల నువ్వుల నూనెలో 6 వెల్లుల్లి రెబ్బలు వేసి, వెల్లుల్లి బాగా నల్లగా మారే వరకు మరిగించి, చల్లారిన తర్వాత ఒక గాజు సీసాలో పదిలంగా పెట్టుకొని కొద్దిగా దూదిని అందులో అద్దుకుని రాత్రి పడుకునే ముందు చెవిలో పెట్టుకున్నట్లయితే ఏరోజు రేడియేషన్ ఆ రోజు రేడియేషన్ నుండి విముక్తి పొందవచ్చు.

సెల్‌ఫోన్ మాట్లాడేటప్పుడు చెవి దగ్గరగా పెట్టుకోకుండా స్పీకర్ ఆన్ చేసి మాట్లాడటం లేదా స్పీకర్ల ద్వారా మాట్లాడటం వల్ల కొంత వరకు రేడియేషన్‌ను అరికట్టవచ్చు.

పైన చెప్పినట్లుగా చెవిలో నువ్వుల నూనెలో అద్దుకున్న దూదిని పెట్టుకోవటం వల్ల ఎంతో మంది ఉపశమనం పొందారు, ఇలా చేయటం వల్ల మా చెవుల నొప్పులు చాలావరకు తగ్గాయని చెబుతున్నారు.

సెల్ ఫోన్ ద్వారా వచ్చే అనేక రోగాలలో ఈ చెవి నొప్పి చాలా ఎక్కువ మందికి వస్తున్నట్లు చాలా నివేదికలు చెబుతున్నాయి. చిన్న పిల్లలకు సెల్‌ఫోన్‌లు అలవాటు చేయటం వల్ల వాళ్ళలో మెదడుపైన అది ప్రభావాన్ని చూపటం, మాటలు త్వరగా రాకపోవటం లాంటి ఎన్నో రకాల జబ్బులకు గురవుతున్నారు. కాబట్టి పిల్లలకు సాధ్యమైనంత వరకు సెల్‌ఫోన్‌లు ఇవ్వకుండా ఉండటం ఉత్తమమైన పని. ●

గమనిక : ఈ శీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు నిష్ణాతులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం. : 94402 86854

# కరోనా సమయంలో 'వెబినార్'ల ద్వారా ప్రజలకు చేరువైన 'పల్లెసృజన'

'కరోనా' మూలంగా యావత్ ప్రపంచం స్తబ్దంగా మారిన సమయంలో 'పల్లెసృజన' ఇన్నోవేషన్లను శోధయాత్రలు, ప్రదర్శనల ద్వారా విస్తరణ చేయలేక పోయింది. దీనివల్ల సమాజానికి పూర్తి స్థాయి ఇన్నోవేషన్లను అందించడంలో సఫలం కాలేదు. ఈ సమయంలో 'వెబినార్' ద్వారా పల్లెసృజన ఇన్నోవేటర్లను పరిచయం చేయాలన్న సంకల్పంతో ప్రతి బుధవారం ముగ్గురు ఇన్నోవేటర్లను, ఒక ముఖ్య అతిథిని, ఒక పల్లెసృజన సభ్యుడిని ఆసక్తి వున్న వారిని కలిపే కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని 'క్రియేటివ్ మైండ్స్' ఎడిఎం సుభాష్‌చందర్ ఆధ్వర్యంలో 14 అక్టోబర్‌నాడు మొదటి 'వెబినార్' నిర్వహించడం జరిగింది. ఈవిధంగా ఇప్పటివరకు వారానికొక్కటి చొప్పున 12 వెబినార్లు జరిగాయి.

ఈ కార్యక్రమంలో ఇన్నోవేటర్లు తమ ఇన్నోవేషన్లను గురించి అందరికీ తెలియజేస్తారు. తర్వాత వెబినార్‌లో పాల్గొన్న సభ్యులు ఆయా ఇన్నోవేషన్లను గురించి తమకున్న అనుమానాలను నివృత్తి చేసుకుంటారు. పల్లెసృజన సభ్యులు, ముఖ్య అతిథి వారి అభిప్రాయాలను తెలియజేస్తారు. ఇలా పూర్తి స్థాయి ఇన్నోవేషన్లను సమాజానికి వెబినార్ ద్వారా అవగాహన కల్పించడం ఈ కరోనా సమయంలో కూడా పల్లెసృజన చేయగలిగింది. ఈ కార్యక్రమం ద్వారా ఇన్నోవేటర్లకు ప్రజలకు మధ్య అనుసంధానం జరగటంతో పాటు సమాజంలోని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, సామాజిక కార్యకర్తలు, రైతు సంఘాలు పరిశ్రమలు సి.ఎస్.ఆర్ ప్రతినిధులు పాల్గొని ఇన్నోవేషన్లను విస్తరింప చేయటానికి తోడ్పడుతున్నారు.

అటు ఇన్నోవేటర్లు, ఇటు సభ్యులు ఎంతో ఉత్సాహంగా ఈ వెబినార్లలో పాల్గొంటున్నందుకు 'పల్లెసృజన'కు ఆనందంగా ఉంది.

ఇంత వరకు జరిగిన వెబినార్ ల వివరాలను పల్లెసృజన వెబ్‌సైట్ www.pallesrujana.orgలో చూడవచ్చు.

-ఎడిటర్.

| కార్యక్రమంలో పాల్గొన్న ఇన్నోవేటర్లు, ముఖ్య అతిథులు... సర్వశ్రీ | | | |
|---|---|---|---|
| **ఇన్నోవేటర్లు:** | సుబ్బారావు | ఐడిసి హెడ్ | **రవీందర్** |
| మహిపాల్ చారి | మునిస్వామి రాజా | **ముఖ్య అతిథులు:** | వ్యవస్థాపకులు |
| బాలయ్య | తిరుపతిరావు | **శివశంకర్ పింజే** | వందేమాతరం ఫౌండేషన్ |
| కొప్పుల అశోక్ | శ్రీహరి బాబు | న్యూ లైఫ్ ఫౌండేషన్ | **సూర్యకళ** |
| నాగశ్రీనివాస్ | ఎ.కె. రావు | **పంతంగి రాంబాబు** | వ్యవస్థాపకురాలు, |
| గాద్రె అశోక్ | అంజయ్య | సీనియర్ జర్నలిస్ట్, సాక్షి | మన ఊరు మన బాధ్యత, |
| సయ్యద్ సుభాని | అల్లాడి ప్రభాకర్ | **వీరభద్రరావు** | గ్రామభారతి |
| గాద్రె అశోక్ | డి.ఎస్. వెంకట్ | రిటైర్డ్ సైంటిస్ట్, సిసిఎంబి | **ఆకుతోట రామారావు** |
| కొప్పుల అశోక్ | మహేష్ రెడ్డి | **సదాశివ హరిబాబు** | అధ్యక్షుడు, గ్రామభారతి |
| చిన్ని కృష్ణుడు | కొండల్ నాయక్ | సేంద్రియ వ్యవసాయ రైతు | **సుధాకర్ రెడ్డి** |
| లింబారెడ్డి | అబ్దుల్ జలీల్ | **డా. కె. వరప్రసాద్** | రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ |
| వెంకట కృష్ణుడు | మందిని పుల్లారెడ్డి | మాజీ డైరెక్టర్, | **డా. గంగాధరం** |
| శ్రీమతి దూల రాణి | పాండురంగారావు | ఐఐఓఆర్-ఐసిఏఆర్ | డిప్యూ.ఓ.ఆర్.డి., తిరుపతి |
| గజ్జా చంద్రశేఖర్ | ముళ్లపూడి సత్యనారాయణ | **శ్రీమతి అన్నె విజయ** | **డా. హరి నాయుడు** |
| శ్రీమతి టి. శ్రీదేవి | గురుమూర్తి శెట్టి | ప్రోగ్రాం మేనేజర్, టిఎస్ఐసి | మేనేజింగ్ ట్రస్టీ, అక్షయ ట్రస్ట్ |

## సమస్యలకు ఆహ్వానం

'పల్లెసృజన' ఇంతవరకు సమాజంలోని ఇన్నోవేషన్లను వెతికి, వెలుగులోకి తీసుకు రావడానికి స్వచ్ఛందంగా గత పదిహేను సంవత్సరాలుగా ప్రయత్నాలు చేస్తున్నది. ఇప్పుడు మీ సమస్యలను కూడా సేకరించి, వాటికి పరిష్కారాలు ఇన్నోవేటర్లతో చేయించాలని సంకల్పించింది. గ్రామాల్లో మీరెదుర్కొనే సమస్యలతో సతమతమవుతూ వుంటే దయచేసి ఆ సమస్య వివరాలు క్రింద ఇచ్చిన వాట్స్ యాప్ నంబర్లకి పంపగలరు. ఎన్ని సమస్యలైనా పంపవచ్చు. పరిష్కారాలను వెతికే ప్రయత్నాలను, వాటి ప్రగతిని మీకు 'పల్లెసృజన' పత్రిక ద్వారా తెలియజేస్తూ వుంటాము. - ఎడిటర్.

**వాట్స్ యాప్ నంబర్లు : బ్రిగేడియర్ గణేశం, 9866001678, సుభాష్ చందర్, 9652801700**

నా మిరప పంటను బొబ్బర తెగులు పూర్తిగా ఆక్రమించటంతో పూర్తి నిరుత్సాహానికి గురయ్యాను. ఎవరిని అడిగినా ఇక ఈ పంట పనికి రాదు, పీకేసి వేరే పంట వేసుకో అని సలహా ఇచ్చారు. అటువంటి సమయంలో 'పల్లెసృజన' ద్వారా వెలుగులోకి వచ్చిన దీని నిరుగుడుకు మందు ఉంది అని తెలుసుకుని చివరి ప్రయత్నం చేద్దాం అని 'స్టాప్' మందును పిచికారి చేశాను. కేవలం 5 రోజుల్లో నేను ఊహించనంతగా పంటలో మార్పును గమనించి నాకెంతో ఆనందం వేసింది. వారం తర్వాత మరోసారి పిచికారి చేశాను. 15 రోజుల తర్వాత నా పంట వైరస్ నుండి పూర్తిగా బైటపడి, లేత ఆకులు, పూత, పిందెతో కళకళలాడుతోంది. ఇక నేను ఎవ్వరి మందులూ నమ్మను అని 'పల్లెసృజన' వారి మందులు మాత్రమే వాడాలి అనుకుంటున్నాను. తోటి రైతులు, నా పంటను తీసివేయమన్నవారు కూడా ఇప్పుడు పంటను చూసి ఆశ్చర్యానికి గురవటంతో పాటు వారు కూడా ఆ మందును తెప్పించమని అడుగుతున్నారు.

అంతేగాక మా నాన్న 'పల్లెసృజన'కు ఫోన్ చేసి, మీరు మా బిడ్డ ప్రాణాలు కాపాడారని ధన్యవాదాలు తెలియచేశారట. ఈ పంట వైరస్‌కు గురి కావటంతో మావాడి ముఖంలో దిగులును చూసి తనకెంతో భయమేసిందని, మీ మందు వాడిన తర్వాత వాడి ముఖంలో వెలుగును చూస్తున్నాను, పంటను చూస్తుంటే ఎంతో ఆనందంగా వుందని ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

**– వెంకట్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ. ఫోన్: 8885245289**

నా పేరు హన్మంతు, నా మిర్చి పంట దిగుబడి వచ్చే సమస్య లేదని తీసివేద్దామనుకుంటున్న తరుణంలో మీరు వెలుగులోకి తెచ్చిన 'స్టాప్' మందు తెప్పించుకుని పంటపై 15 రోజుల్లో రెండుసార్లు పిచికారి చేశాను. ఎంతో ఆకర్షణీయంగా మారటంతో పాటు, పూత, పిందెలు కూడా అధికమయ్యాయి. ఈ ఆనందాన్ని ఆనందాన్ని మీతో పంచుకోవడం నాకెంతో సంతోషంగా వుంది.

**– హనుమంతు, వికారాబాద్, తెలంగాణ. ఫోన్: 9849071343**

మీరు చెప్పిన మందు స్ప్రే చేసినందుకు నా మిరప పంట మార్పును చూసి ఎంతో ఆనందంగా వుంది. నా పొలంలో అంతర సేద్యం చేయటానికి ఎద్దులతో కిరాయికి వచ్చే 'రామచంద్రప్ప' అనే రైతు ఒక నెల క్రితం ఈ పొలంలో సేద్యం చేయటానికి వచ్చినపుడు ఈ పంటను చూసి దీనికి సేద్యం కూడా దండగేనప్పా, పెరగొట్టి వేరే పంట ఏదైనా వేసుకోమని చెప్పారు. కాని ఏం మందు వాడినావప్పా, పంటను చూస్తుంటే చాలా ఆనందంగా వుంది. అప్పుడు నేను చూడబుద్ధి కూడా కాలేదు, ఇప్పుడేమో చేలోనుంచి బైటకు వెళ్ళబుద్ధి కావటం లేదు, పంట బాగుండటమే కాదు, పూత, కాయ కూడా చాలా ఎక్కువగా వస్తోంది. మంచి పని చేశావప్పా అంటూ తన సంతోషాన్ని తెలియచేశాడు. అంపిగాని వైరస్‌ను నిర్మూలించే మందును అందించినందుకు మీకు ధన్యవాదాలు సార్.

**– వీరనాయుడు, ఆస్పరి, ఆలోనిపల్లి, కర్నూలు జిల్లా. ఫోన్: 9701963069.**

పల్లెసృజన యాజమాన్యానికి,

'పల్లెసృజన' ద్వారా వెలుగులోకి వచ్చిన మిరప పంటలో అంపిగాని వైరస్‌ను నిర్మూలించే 'స్టాప్' మందు వాడటం వల్ల నేను ఊహించని విధంగా పంట చాలా బాగా వస్తోంది. మా ఊర్లో దాదాపు ప్రతి రైతు వచ్చి నా పంటను చూసి పోతున్నారు. వారి ఆనందాన్ని తెలియచేస్తూ ఆ మందు మాకు కూడా తెప్పించమని అంటున్నారు. ఒకరి ద్వారా మరొకరికి తెలిసి మా చుట్టుముట్టు వున్న గ్రామాల రైతులు కూడా వచ్చి నా పొలాన్ని చూస్తుంటే నాకెంతో ఆనందంగా వుంది. ఇంత మంచి పురుగు మందును రైతాంగానికి అందించినందుకు కృతజ్ఞతలు.

**- భాస్కర రెడ్డి, మంత్రాలయం, కర్నూలు జిల్లా. ఫోన్: 9440167725**

**పల్లెసృజన ద్వారా వెలుగులోకి వచ్చిన పునాది స్థాయి ఇన్నోవేటర్ సంగటోయిన వెంకట కృష్ణుడు చేసిన కృషి మంచి ఫలితాలు ఇస్తున్నందుకు రైతు సోదరుల పంట నష్టాలను తగ్గిస్తున్నందుకు, వాటి ఫలితాలను రైతులు అనుభవించి ఆనందాన్ని తెలియచేస్తున్నందుకు 'పల్లెసృజన' వారికి మనసారా కృతజ్ఞతలు. వెంకట కృష్ణుడిని మీ అందరి తరుపున అభినందిస్తున్నాం. రైతులందరికీ ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు. -ఎడిటర్**

# చూడాలనుకున్నదే చూసే అలవాటు



ఒకానొక కాలంలో జపాన్ దేశంలో రెండు కప్పలుండేవి. ఒకటి సముద్రం ఒడ్డున ఒసాకా నగరం దగ్గర ఓ గుంటలో నివసించేది. రెండోది క్యోటో నగరం గుండా పారే స్వచ్ఛమైన సెలయేరులో ఉండేది. అంత దూరాన ఉండటం వలన అవి ఒకదాని గురించి ఒకటి ఎప్పుడూ విని ఉండలేదు. కానీ ఆశ్చర్యంగా ఆ రెండింటికీ ఒకేసారి ప్రపంచాన్ని చూడాలన్న తలంపు వచ్చింది. క్యోటో నగరంలో నివసించే కప్ప ఒసాకా నగరం వెళ్లాలని, ఒసాకాలోని కప్ప క్యోటో నగరం చూడాలని నిశ్చయించుకున్నాయి.

సరే, వసంత కాలంలో ఒక ఉదయాన రెండు కప్పలూ క్యోటో, ఒసాకా రోడ్డెక్కాయి. ఒకటి ఈ చివరి నుంచి, ఇంకోటి ఆ చివరినుంచి. ప్రయాణం అవి అనుకున్నంత సులభంగా లేదు. ఇద్దరికీ ప్రయాణించే అలవాటు లేదు మరి. అదీగాక, రెండు ఊళ్ళ మధ్యలో ఒక పెద్ద కొండ ఉంది. దాన్ని అవి ఎక్కాల్సి వచ్చింది. చాలా సమయం తీసుకొని చాలా దూరం గెంతి ఎట్టకేలకి కొండ శిఖరాన్ని ఒకేసారి చేరుకొని ఒకదాన్ని ఒకటి ఎదురెదురుగా చూసుకొని ఆశ్చర్యపోయాయి.

ముందు మాటా పలుకు లేకుండా ఒకదాన్ని ఒకటి తేరిపార చూసుకొని తరువాత మాటల్లో పడ్డాయి. తాము ఇక్కడనుంచి ఇంత దూరం ఎందుకొచ్చామో చెప్పుకొన్నాయి. ఇద్దరిదీ ఒకే కారణం, ఒకే కోరిక..... దేశాన్ని చూడటం అన్నది తెలుసుకొని చాలా ఆనందపడిపోయాయి. సరే తొందరేం లేదని నిర్ణయించుకొని కొంతసేపు ఒక చల్లని తడి ప్రదేశంలో విశ్రాంతి తీసుకొని ఎవరి దారిన వారు ప్రయాణం సాగించాలని నిర్ణయించుకొన్నాయి.

మనం కొంచెం పొడుగ్గా ఉండివుంటే బావుండేది. చక్కగా ఇంతెత్తునుంచి రెండు ఊళ్ళూ ఒకేసారి చూసుకొని మనం వెళ్ళి అక్కడ చూడాల్సినంత ఏముందో తెలుసుకునేవాళ్ళం అది ఒకసాకా కప్ప. దానికి క్యోటో కప్ప "అదేం పెద్ద కష్టమైన పనేం కాదు, మనం వెనక కాళ్ళపై నిలబడి ఒకరినొకరం గట్టిగా పట్టుకొని ఉండగలిగితే మనం వెళ్ళదలుచుకున్న ఊరిని చూడొచ్చు కదా" అంది.

ఈ ఆలోచనా ఒసాకా కప్పకి చాలా నచ్చింది. నచ్చడమేంటి వెంటనే అది తన స్నేహితుడి భుజాలు పట్టుకొని నిలబడింది. ఇవతలి కప్ప మెల్లగా లేచి నిలబడింది. ఇద్దరూ ఒకరినొకరు గట్టిగా పట్టుకొని క్యోటో కప్ప ఒసాకా వైపు, ఒసాకా కప్ప క్యోటోవైపు దృష్టి సారించాయి. కానీ పాపం అవి ఒక విషయం మరిచిపోయాయి. అవి నిలబడ్డప్పుడు వాటి ముక్కులు అవి వెళ్ళవలసిన వైపుకు ఉన్నా, వాటి కళ్ళు వెనకవైపుకు ఉంటాయి అన్నది. ఫలితంగా అవి ఎక్కడినుంచి వచ్చాయో ఆ నగరాన్నే చూశాయి.

అయ్యో! క్యోటో నగరం కూడా అచ్చం ఒసాకాలాగానే ఉన్నది, అనవసరంగా అంత దూరం ప్రయాణం చెయ్యనవసరం లేదు, నేను వెనక్కి వెళ్ళిపోతానన్నది ఒసాకా కప్ప. అవును నాకిక్కడా ఒసాకా నగరం క్యోటోలాగనే ఉంటుందని ఏమాత్రం తెలిసినా నేనసలు ఈ ప్రయాణం చేసేదాన్నే కాదు అన్నది క్యోటో కప్ప. ఇలా అనుకుని ఒకరి భుజంమీంచి ఒకరు చేతులు తీసేసి గడ్డిమీదకు వచ్చి పడ్డాయి. కొత్తగా చూసేదేం లేదని నిర్ణయించుకొని అవి మర్యాదపూర్వకంగా వీడ్కోలు చెప్పుకొని ఎవరు వచ్చిన దారిలో అవి తిరిగి ప్రయాణమయ్యాయి. జీవితాంతం ఆ రెండూ క్యోటో, ఒసాకా నగరాలు ఒకేలా ఉంటాయన్న భ్రమలో ఉండిపోయాయి.

నిజానికి వాటికి రెండు బఠాణీ గింజలకున్న పోలిక ఉన్నా రెండు నగరాలకుండే వ్యత్యాసం వుంది.

అప్పుడప్పుడూ మనం మన దూరదృష్టికి, జీవన దృక్పథానికి దగ్గరగా వుంటామని అనుకుంటాం. దగ్గరగా అంటే భౌతిక దూరం కాదు, అది నేర్చుకోవాలన్న దృక్పథం. మన ఆలోచనలు కుదించుకుపోతే మన దూరదృష్టి హ్రస్వమైతే మన జీవితంలో కొత్తపుంతలు తొక్కలేము. ఎందుకంటే మనకు ప్రస్తుతమున్న అనుకూల పరిస్థితుల్లోనే ఉండాలని కప్పల్లా అనుకుంటాం. ప్రస్తుత అనుకూల పరిస్థితిలోనే మనం ఎప్పుడూ వుంటే కొత్త ఆలోచనలు ఎలా వస్తాయి, కొత్త పుంతలు ఎలా తొక్కగలం. మనము అనిశ్చిత పరిస్థితిని, కొత్త ప్రదేశాలను, అనామకులను, తెలియని సంస్కృతిని, తెలియని మార్గాలను శోధించలేము. కొత్త మార్గాలను శోధించాలంటే కప్పలా కాకుండా, కుతూహలంతో చూసింది ఒప్పుకోవద్దు.

– హాసీదీ 22(2) జనవరి–జూన్ 2011

PALLE SRUJANA Telugu Bi-monthly November - December 2020 RNI No. TELTEL 2012/74620

# పల్లెసృజన

ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే

## పాత సంచికలు కావాలా?



Pay by "Phone Pe" to 9866 00 1678

- 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 8125799904, 9866 00 1678

E-mail : president@pallesrujana.org Visit us : www.pallesrujana.org

M/s Pallesrujana, Canara Bank, Sainikpuri, Secunderabad.
SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023

చందా వివరాలు

| వివరములు | వ్యక్తిగతం |
| --- | --- |
| రెండు సంవత్సరాలకి | 400/- |
| ఐదు సంవత్సరాలకి | 1,000/- |

లేదా

ఫోన్ పే ... 9866 00 1678 ...

QR code for Phone Pe

Scan & Pay Using PhonePe App